ములను బాణములవలె భేదింపఁగల్గును? అయ్యో! ఇంతటినష్టము ఎట్లుతీరును?

ఆనాఁడు సాయంత్రమువేళ శవమును వెడలఁదీసిరి శ్మశానమునకుఁబోయిన వారిద్దఱే. ఒకఁడు భైరవమూర్తి; రెండవవాఁడు భేతాళమూర్తి. దిక్కుమాలిన ముసలిదాని శవమైనను నింత నికృష్టముగాఁ బోలేదు.

ముసలిది, నాగమ్మను జంపిన తరువాతనైనను, భైరవమూర్తిని వదలలేదు. రాత్రిందివము లాతనికి ముసలిదాని ధ్యానమే. ప్రొద్దుపోవుమార్గ మేదైన నున్నచో నతనిబాధ కొంతతగ్గియుండును; కాని, యొక పురుగైన నాతని కడపఁ ద్రొక్కలేదు. తానే నీళ్ళు తెచ్చుకొనును. తానే యంట్లు తోముకొనును. దుఃఖము, క్రోధము, విచారము, భయము! ఇందఱు శత్రువులతో నతనిమేథ స్సెన్నిదినములు పోరాడఁగల్గును? అందులో నది పనిలేనిమెదడా? సదా 'లా' విషయములను గుఱించిన యాలోచనములకును, తర్కవితర్కమునకును, లోనైనమెదడు!

పండ్రెండుదినములు, ఈ ఏకాంతవాసశిక్ష గడచెను. పదమూఁడవనాఁడు భైరవమూర్తి తెల్లబట్టలు కట్టుకొని, దస్తరమును చంకనుంచి, ఎప్పటివలెఁ గోర్టుకుఁ

బోయెను. ఆనాఁ డాతని ముఖము కొంత వికసించి యుండె. "కోర్టుకు పోఁగానే పార్టీలువచ్చి చుట్టు మూఁగుదురు; నన్నూ నడింతురు; నేనును నాల్గు కన్నిటి బొట్లను రాల్చెదను. ఆతరువాత ట్రాన్స్ఫరుపత్రములు, రాజీనామా దస్తావేజులు, తాకట్టుపత్రములు కుప్పలు కుప్పలుగా వచ్చి కూలును; డబ్బులు ధొరకును" అని తలఁచుకొను చుండునప్పు డాతని కానందముగానే యుండెను. కాని కోర్టుకుఁ బోయిన తరువాత నక్కడ పత్రములు లేవు; పయికము లేదు. పార్టీల తొందరయును లేదు. దస్తరము విప్పుకొని చాలసేపు కూర్చుండెను; కాని, ఒకఁడైన నతని యొద్దకు వచ్చిన పాపమునఁబో లేదు. కుశలప్రశ్నమైనను చేసినవాఁడు కానరాఁడయ్యె. క్రొత్త పార్టీలమాట యటుండ, తరతరములనుండి పరిచితులుగానున్న పార్టీలు సైతము, మొగము చాటువేసి దాటి పోవ నారంభించిరి. భైరవమూర్తి యెదుట దిగఁ దుడుపునకైనఁ బనికిరాని రామచంద్రయ్య యానాఁ డందఱకు నాలోచన చెప్పువాఁడయ్యెను! అతనిచుట్టు పెద్దగుంపు మూఁగియుండెను. నాల్గుపద్దులు రాని రామచంద్రయ్య కెంతటి యదృష్టము పట్టినది! సాయంత్రమువఱకుండి నిరాశావశుఁడై యింటివైపు మరలెను. ఇంటివైపున

కొక్కొక యడుగుపెట్టిన కొలఁది ముసలిదాని విగ్రహము పొడకట్ట నారంభించెను! దీపము ముట్టించు వేళకు నిల్లుచేరి వాకిలి తలుపు తెఱవఁగానే యాతనికి ముందు, భేతాళమూర్తి కొంటెతనమునఁ గట్టివేసియుంచిన రెండు కుక్కలు తటాలునఁ బఱుగెత్తి వచ్చెను. ప్రాణములు పైఁబైన నెగురఁ గేకవేసి నేలమీఁదఁ బడెను!

భైరవమూర్తిగతి తరువాత నేమైనదో తెలియదు. ప్రతిదినము నాతఁడు కోర్టుకుఁ బోవుచు సాయంత్రము వేళ నిరాశతో నింటికివచ్చుచుఁ గనఁబడుచుండెను. కోర్టులోవచ్చు నాదాయము లేకపోయినను నచ్చటికిఁ బోయివచ్చుట, అప్పులవాండ్ర బాధలఁ దప్పించుకొనుటకు మాత్రము దివ్యమైన యుపాయముగా నుండెను! తరువాతఁ గొన్ని నెలలవఱకు నాతఁడు గానరాలేదు. బదరికాశ్రమమునకుఁ బోయెనఁట! ఒకనాఁడు బైరాగి యొకఁడు విభూతి ధరించి, పొడుగుపాటి జడలు, కేలఁ గమండలవుఁబూని యాయూరికి వచ్చెను. మాటయందేమి నడకయందేమి, అతఁడు భైరవమూర్తిఁ బోలియుండెను. ఆరాత్రి మూర్తిగారి యింటినుండి పొగ వెడలి వెడలి పెద్దమంట లేచెను. నాగమ్మ వాగ్జ్వాలమైనను నంత భయంకరముగా నుండలేదు. వందలకొలఁది

జను లచటికిఁ బోయిరి. వినోదము చూచుచుండిరి కాని చల్లార్ప లేదు!

భైరవమూర్తి గ్రామము విడిచిపోయినతరువాత భేతాళమూర్తి మేనమామ యింటికిఁ బోయి యచటఁ గొన్ని దినములు గడపెను. అతని సద్వర్తన మచ్చటి వారికి సంతోషముగనుండ లేదు! ఒకనాఁడతఁడెవరి పొలములోనో కంకులు గోసికొనెను. పొలమువాఁడు నాలుగు లెంపకాయ లంటించెను. మనవానికిఁ గోపము వచ్చి రాత్రివేళఁ బొలమును బాడుచేసెను. వేలరూపా యలు నష్టమువచ్చెను. పోలీసువారు వానిని బట్టుకొని పోయిరి. ఇప్పుడతఁడు బహుశః జ్ఞానమఠములో నుండవచ్చును.

నేనే

ప్రథమ రంగము

ఆ. అయ్యలార! మనము సౌఖ్యంపుమాటలు
పెక్కుపలుకనేర్తు మక్కువమున
కర్మచేతఁగాని ధర్మంబుచేఁగాని
చేసిచూపనేర చేతఁగాదు. హై. నృసింహశాస్త్రి.

ఇతరవిషయములలో గణపతిరావు నభిప్రాయము లీకాలపు యౌవనులవంటివేయైనను, నీతివర్తన విషయమున మాత్రమతని భావములు కొంతవఱకు విచిత్రములుగాను, సాధారణ దృష్టికిఁజాల మీఱినవిగాను, ఉండును. అతని యుద్దేశమున 'నీతివర్తనము' అను దానికి స్త్రీసంబంధమగు విషయసుఖాభిలాష లేకపోవుటయని యర్థము. ఇట్లనుటవలన నతనికి నీతివర్తనమను దానికిఁగల విశాలమగు నర్థము తెలియదనికాదు. నిజమేమనఁగా నతఁడు 'నీతివర్తనము'లోని యీ ప్రత్యేక భాగమునకింతయని నిర్ణయించుటకు వలను

గాని ప్రాముఖ్యము నిచ్చుచుండును. స్నేహితులతో సంభాషించునపుడేమి, ఉపన్యాస వేదికపైన నుండునపుడేమి, పత్రికాదులకు వ్రాయుటకై కలమును జేతఁబూనినపుడేమి, పైనఁజెప్పిన 'నీతివర్తనము' అప్రయత్నముగనే బయటబడుచుండెడిది "...గారు చాలమంచివారు. వారి స్వార్థత్యాగము ప్రశంసనీయము. స్వలాభమునే యభిలషించియుండినచో వారిదివఱకున్నతన్యాయస్థానాధికార (హైకోర్టు జడ్జీ) పదవికి వచ్చియుందురు..." అని ఎవరిని గుఱించియైనను నెవరైనఁ జెప్పినప్పుడతఁడు ముఖముచిట్లించి "అతఁడా! ఛీ! అంతటి దుర్మార్గుం డెవ్వఁడును లేఁడు. అతని 'నీతివర్తనము'ను నీవు వినలేదు నాకుఁ దెలియును" అని వాదము మొదలుపెట్టును. "...గారు......లక్షల రూపాయలను విద్యాలయమునకై యిచ్చిరి. ఏమి?వారి యౌదార్యము!"అని ఎవరైనఁ జెప్పినపక్షమున "ఏడిసినాఁడు. అతనిని నేనెఱుఁగుదును. అతని వర్తనము తుచ్ఛమైనది. అంతటిజారుఁడు ప్రపంచములో లేఁడు" అని చెప్పనారంభించును. "...... ఎంత ధనవంతుఁడైననేమి? పట్టుమని పదిరూపాయలు జాతీయ కళాశాలకిచ్చిన పాపమునఁబో లేదు. ఒక విద్యార్థికైనను వారమియ్యలేఁడు. అధికారులకుఁ దోటవిందులు సేయుట

యందుమాత్రము తన యౌదార్యమును జూపును" అని ఎవరినిగుఱించియైనను జెప్పఁబడినపక్షమున "అతని సంగతి నీ కేమి తెలియును. అతని నీతివర్తనము శ్లాఘాపాత్రము" అని వాదమునకు దిగును. వేయేల? మనుష్యుల మంచితనమునుగాని చెడుతనమునుగాని నిర్ణయించుట కతనియొద్దసాధన మొక టేకలదు. స్త్రీలోలత్వసబంధమగు దౌర్బల్యము గలవాఁ డేని యతనియందితర సుగుణము లెన్నియున్నను సున్నయే. ఎట్టిదుర్గుణములు గలవాఁడైనను నట్టి దౌర్బల్యముమాత్రము లేదేని, అతఁడు బ్రహ్మరథముఁ బట్టఁదగినవాఁడే.

ద్వితీయ రంగము

న్యాయవాది వృత్తిలోఁ బ్రవేశించినతరువాత, గణపతిరావుయొక్క యాదాయ ముద్యోగములోనున్న నాఁటికంటెఁజాల హెచ్చెను. నెలకు సుమారు వేయి రూప్యములు రాసాగెను. చిన్నతనమునుండియు నతఁడు చాల మితవ్యయబుద్ధికలవాఁడు. ఉద్యోగము చేయుచుండిన దినములలోఁగూడ నాతని మితవ్యయబుద్ధి యట్లే యుండెను. కాని న్యాయవాదియైనపిమ్మట నాదాయ

ముతోఁబాటు మితవ్యయాసక్తియు వృద్ధియై పిసినిగొట్టు
తనమును సమీపించెను. అంతేకాదు. అసూయాపరు
లనేకు లతనికి ‘పిసినారి’యను బిరుదము నిచ్చిరి.
కాని, తానట్లు పిలువఁబడుటకుఁ గారణము మాత్రము
గణపతిరావునకొక్కనాఁడైనను గ్రాహ్యము కాలేదు.
‘నేను లోభినా’ యని యతఁడు పలుమాఱు విత
ర్కించుకొనెను. కాని ప్రతిపర్యాయమును ‘కాను’అను
తీర్మానమే ప్రత్యుత్తరమిచ్చుచుండెను. ‘వందలకొలఁది
రూప్యములు పాడుచేసి నేను పెద్దయిల్లు బాడుగకు తీసి
కొనలేదఁట! నా యింటిలో వ్యర్థముగ సోఫాలును కురి
చీలును, మూల మూలలఁబడి మూల్గుచుండలేవఁట!
నేను రెండుగుఱ్ఱముల ‘బ్రూహాము’ బండిని నుంచుకొన
లేదఁట! పనిపాటలులేక కుక్షికిపాట్లు పడుచుండు నౌక
రులు నాయింటిలోఁ బదిమంది లేరఁట! కనుక నేనులోభి
నఁట! దక్షిణాఫ్రికా భారతీయుల నిధికి నేను ధనసాహా
య్యము చేయకపోవుటకుఁ గారణములు గలవు. గంధి
యవలంబించినమార్గము జయప్రదమగునది కాఁజాలదని
నేనియ్యలేదు. బందరు జాతీయ కళాశాలలోఁ జెప్పు
విద్య దొరతనమువారి నిబంధనల ననుసరించి నద్ధికాదు.
కనుక దానిలోఁజదువువారికి ముందు మంచియాశలు

లేవని తలంచి నేనా విద్యాలయమునకు సాహాయ్యము చేయలేదు. ఆంధ్ర రాష్ట్రోద్యమము మనదేశీయులలో నంతఃకలహమును బుట్టించునది కావున నది నాయామోదమును బొందలేదు. కాకున్నచో నేను వీనికిని ద్రవ్యసహాయము చేసియుండనా?' యని కొన్ని వేళలను, 'లోభి లోభి యని యోర్వలేనివారు కొందఱు నన్ను నిందించుచుందురే! తత్త్వము విచారించినచో లోభి యేకారణమువలన దూష్యుఁడో తెలియరాకున్నది. తాను కష్టపడి చెమట యొడిపి సంపాదించుకొనిన ధనమును జాగరూకతతోఁ గాపాడుకొనుట సుగుణమా? దుర్గుణమా? ముందెట్లుపోయి యెట్లువచ్చునో యని కొంతధనమును దాచియుంచుకొనుట దూరదర్శిత్వమా? వెఱ్ఱితనమా' యని మఱికొన్ని వేళలను, దలపోయుచు వృత్తివలనఁ దానార్జించిన యుక్తి నంతయు వినియోగించి తుదకు తాను నిర్దోషినని మనోనిశ్చయము చేసికొనుచుండెను. ద్రవ్యము విషయమున నతనిపట్టెంత గట్టిదైనను నవయౌవనయు సుఖేచ్ఛగలదియునగు హైమవతిని సంతోషపఱచి యామె వీక్షణములను బ్రసన్నములుగాఁ జేసికొనుటకొఱకైనను దనయిష్టమునకు మించి ధనమును నప్పుడప్పుడతఁడు ఖర్చుపెట్టక తప్పినదికాదు.

———

తృతీయ రంగము

హైమవతి, యాకారమునఁ గొంచెము పొడవై బంగారమువంటి మనోహరమగు శారీరిక శోభతోను, దర్శనీయములగు ముఖలక్షణములతోను, ప్రకాశించుచుండును. గానమువలె మధురముగానుండు నామె కంఠధ్వని వినువారి వీనులకు విందుఁ గొల్పుచుండును. ఈ శారీరిక సౌందర్యమునకన్న నెన్నియోగుణము లధికముగా నామె మానసిక సౌందర్య మాకర్షణీయమై యుండె.

సాధారణముగా మన హిందూస్త్రీలు చాల మృదులస్వభావము గలవారు. వారికిఁ జిత్తస్థైర్య ముండదు. క్రొత్తవా రెవరైన మాదలించినచో వారు ప్రత్యుత్తరమిచ్చుటకు జంకెదరు. ఇల్లు విడిచి యవతలికిఁ బోవలసివచ్చినచో వెంట మనుష్యుఁ డుండిననే కాని వారి యడుగు ముందునకు సాగదు. కొంచెమేదైన నాపదవచ్చినచో వారు కన్నీరు గార్చుట తప్ప మఱేమియుఁ జేయజాలరు. కాని హైమవతి స్వభావ మట్టిదికాదు. తన సామర్థ్యమునందామెకు సంపూర్ణ విశ్వాసము గలదు. ఆమె భావము లున్నతములై యుండెను. ఎట్టి యాపదలు వచ్చినను జంకెఱుఁగదు. మంచి యాలోచనశక్తియును నట్టిశక్తి నుపయోగిం

చుటకు వలయు ధైర్యమును నామె పుట్టుకతోడనే వెంటఁ దెచ్చుకొనెను. పురుషులతో సంభాషింపవలసి వప్పుడును నామె నిర్భయముగా మాట్లాడుచుండును.

శ్రావణమాసము వచ్చినది. హైదరాబాద యందలి పురోద్యానము చూపులకు విందుఁ గొల్పుచున్నది. ఎచ్చటఁ జూచినను పచ్చని పచ్చిక కానవచ్చుచున్నది. సాయంత్ర మయ్యెను. కృత్రిమములగు నీటి కొలనులో నొక ప్రక్కనఁ బడవలమీఁదఁ గొందఱు నీటుకాండ్రు విహరించుచున్నారు; వేఱొక ప్రక్కనఁ బెద్దబాతులు తమ రెక్కలను విప్పుచు ముడుచుచు రెపరెపలాడించుచు గుంపులు గుంపులుగఁగూడి నీటిపైనఁ దేలియాడుచున్నవి. కాలినడకను, ద్విచక్రికల (బైసికళ్ల) మీఁదను, గుఱ్ఱపుఁబండ్లమీఁదను, స్వయంతోల నాశక్తిశకటంబులలోను, (మోటారు) గూర్చుండి, వచ్చుచుఁ బోవుచునుండు వారి సంఖ్యను లెక్కించుట దుస్సాధ్యమై యున్నది. ఆసమయమున గణపతిరావు తన యొంటిగుఱ్ఱపుబండి నెక్కి యచ్చటికిఁ బోయి యొక పొదరింటికి సమీపముననున్న ఫలకముమీఁద గూర్చుండెను.

అంతలో నొక మాలరి (తోటలో పనిచేయు వాఁడది) మెల్లమెల్లఁగా మన న్యాయవాదిని సమీపించి లకోటా చేసియున్న యొకజాబు నతని కందించి వెడలి పోయెను ఉత్తరమును జదువుకొనినప్పు డాతనిముఖ మున నానందమును బెదవులపైనఁ జిఱునగవును గాన వచ్చుచుండెను. దానిలో నేమియున్నదో?

చతుర్థతంగము

"రసికవరా!

సృష్టిసౌందర్యమును జూచి యానందతరంగము లలో నోలలాడుచున్న మీ సౌఖ్యమునకుఁ గొంచెము సేపు భంగము గలిగించుచున్న నన్ను క్షమించి నా విన్నపము నాలకింప వేడెదను చిరకాలము నుండి నేను పురుషుల స్వభావమును బరీక్షించుచుంటిని. పురు షులు సర్వసాధారణముగా స్వార్థపరులనియు, నీతిబల ములేనివారనియు, నాయనుభవమువలనఁ గనుఁగొంటిని. ప్రేమాభరితమగు తన హృదయమును నిర్వ్యాజముగ నొక పురుషునకర్పింప నేదేని స్త్రీతలఁచినచోఁ దదను గుణ్యమగు నిశ్చలప్రేమతో నా యమూల్యరత్నమును

గ్రహించు యోగ్యుఁడు నాకుఁ గొన్ని దినముల క్రిందటి వఱకుఁ గానవచ్చియుండలేదు.

అయినను నాకృషి వ్యర్థము కాలేదు. ఉన్నతమగు మానసముచేతను, సుగుణసంపదలచేతను, నిరుపమానమగు పురుషరత్న మొకటి నాకంటఁబడినది. అతని యందుఁగల గుణరాజములు స్థూలదృష్టికి గోచరములు కాజాలవు కాని, అన్వేషణపరులకుఁ దెలియరాని రహస్యముండదు. ఆయన ప్రాయముగాని శారీరక సౌందర్యముగాని నన్నాకర్షింపలేదు. అతని గుణసంపద నా హృదయమును వశము చేసికొనినది. నన్నా పురుషపుంగవున కర్పించుకొనుటయే నామనోరథము. దీనికి వెనుక ముందు లేదు. రేపురాత్రికిఁ దమరు 'కృష్ణాథియేటరు' నకు వచ్చినచో నచ్చటఁ దమ కృపకుఁ బాత్రియగుటకై యీదాసి వేచియుండును.

ఒక జవ్వని."

అని యా యుత్తరమం దుండెను గణపతిరావా యుత్తరమును మరల మరలఁ జదివెను. చదివినకొలఁది నాతనికి మితిలేని యానందము గలుగసాగెను "ఈ యువతి విద్యావతియు రసజ్ఞయు నైనట్లు కానవచ్చుచున్నది. బాహ్య సౌందర్యమును ధనమును నాసించు

స్త్రీలు విస్తారముగాఁ గలరు. కాని యిట్టి సుందరులఱుదు. ఒకరియందుఁగల గుణములను నిజముగాఁ గనుఁగొనువారు తక్కువ. నాసుగుణరత్నములఁ బరిశీలించు రత్నపరీక్షకురాలు నేఁడు దొరకెను. ఆమె నన్ను చటనో చూచి యుండును. నావర్తనమును వినియుండును. సాధారణులగువారిని లెక్కకుఁ దీసికొనని యాసుందరి నాయోగ్యతను సంపూర్ణముగ గ్రహించియే యిట్టి యుత్తరము వ్రాసినది!"

ఇట్లనుకొనుచుఁ గొలనుకడకుఁ బోయి నీటిలోఁ దన ముఖమును జూచుకొని చెమ్మటచేఁ దడిసియున్న నొసటిని గడిగి చేరుమాలుతోఁ దుడిచికొనెను. కొంత సేపైన పిమ్మట నింటికివచ్చి భోజనముచేసి నిద్రించెను. కాని కలలు తప్ప మంచి నిద్రరానే లేదు.

పంచమరంగము

మఱునాటి యుదయమున మన న్యాయవాది తొమ్మిది గంటలవేళ బజారునకుఁ బోయి షాపులలో మంచివెలగల బట్టలనేకములు గొనెను. అంతటి వెలగల వస్త్రములను నాతఁడెన్నఁడు కొనియుండఁడు.

వర్తకు లాతని యానాఁటి యుదారభావమును జూచి లోలోన నబ్బురపడసాగిరి. ఆతని స్వభావమును బాగుగా నెఱిఁగిన కొందఱు యావనులు దారిలో నాతనిఁ జూచి 'నేఁడిదేమిచిత్రము' అని కనుసైగలు సేసికొనిరి.

ఆనాఁటి క్రొత్తఁదనమును గని హైమవతి, భర్త ముఖమును దేఱిపాఱఁజూచి "ఈదినము దుకాణములో వస్త్రములేవైన నింకను మిగిలియున్నవా?" యని చమత్కారము దోఁపఁ బలికెను.

"తొడుగుకొనుటకై వర్షకాలము వచ్చినదని బట్టలను కొని తెచ్చితిని" అని యాతఁడు ప్రత్యుత్తరము చెప్పెను.

హైమ:—ఈసిల్కు కమ్మీబు, ఇమూర్బట్టలు వర్ష కాలమునకుఁ జాలమంచివే! ఈ అత్తరు బుడ్లు, సెంటు బుడ్లో?

గణ:— స్నేహితులెవరైన వచ్చినప్పు డుండవలెనని తెచ్చితిని.

హైమ:—ఇదివఱ కెన్నఁడును రాని క్రొత్తస్నేహితులు నేఁడు వచ్చువారుందురు. కనుకనే తెచ్చితిరి!

ఈ చివరవాక్యము పలుకునపుడు హైమవతి దృష్టులు గణపతిరావు ముఖమునఁ జెదరక నిలచి యుండెను. అతఁడామెచేసిన పరిహాసమును దెలిసికొనక పోలేదు. పెదవులపైన నటించుచుండిన చిఱునగవుచేత నామె చెక్కుటద్దములపైన నేర్పడిన గుంటలను నాతఁడు చూడకపోలేదు.

మఱియొక మాట నేదియును ననక గణపతిరావు పనిమిమమీఁద నవతలికిఁ బోయెను.

రాత్రి జాముప్రొద్దయినది. చర్చి (గుడి) మీఁది పెద్దగడియారము తొమ్మిది గంటలు కొట్టెను. 'కృష్ణా థియేటరు'లోని విద్యుద్దీపికల కాంతులు విచిత్రవర్ణశోభితములగు పర్దాలపైఁబడి చూచువారికి కన్నులపండువు సేయుచుండెను. వెలగల వస్త్రములనుగట్టుకొని తళతళలాడు బంగారుచట్టములుగల సులోచనములను బెట్టుకొని ముంజేతులపైన 'వాటర్ ప్రూఫు (Water Proof) ఓవరు కోట్లను' మడతచేసి వేసికొని నీట్టుగా నటునిటు జూచుచు యౌవనులు గుంపులు గుంపులుగా నాటకశాలలోఁ బ్రవేశించి కురిచీల నలంకరింపసాగిరి. ప్రేక్షకులను నెక్కించుకొని నాటకశాలకు వచ్చుచున్న మోటారుబండ్ల భంభమారావమును, బగ్గీబండ్ల చప్పుడును,

లోపలివారికి విసుగుఁబుట్టించుచుండెను. అంతలో నేత్రాకర్షకమగు వేషముతో గణపతిరావును, అతనికంటె ముందే ఘుమ ఘుమ లాడు సువాసనయును, లోపలికి వచ్చెను. అంతకుపూర్వము వచ్చియుండిన నీటుకాండ్ర చూపులు సులోచనములలోనుండి యాగంతుకుని ముఖముపైనఁ బ్రసరించెను. వెంటనే వారొకరి ముఖము నొకరు చూచుకొని నవ్వుకొనసాగిరి గణపతిరావు వారి సైగలను జూడనట్టు నటించెను; కాని, తా నసాధారణముగా నాటకశాలకు వచ్చినందున వారు పరిహసించుచున్నారని తెలిసికొనక పోలేదు.

నాటక మారంభమయ్యెను. కాళిదాసుని కథానాయికయగు శకుంతల చెట్లకు నీరుపోయుచు సఖులతో సంభాషించుచుఁ బ్రదర్శించిన మాధుర్యముగాని, తపోవనమును విడిచి హస్తినాపురమునకుఁ బోవునప్పటి కరుణారస ప్రధానములగు భావముల మార్దవము గాని, గణపతిరావు హృదయము నాకర్షింపలేక పోయెను. అతని దృష్టి మొదట ప్రేక్షకురాండ్రున్న ప్రదేశమునకు దుమికి యచ్చట వెదకసాగెనుగాని వారందఱు నాటకమును జూచుటయందు నిమగ్నులై యుండిరి. అతని చూపుల కొకరైనను జవాబిచ్చియుండలేదు.

తుదకు నాటకము ముగిసెను. కణ్వాశ్రమమునుండి భర్తృగృహమునకుఁబోయినశకుంతలతోఁ బాటు నాటక ప్రేక్షకులుగూడ తమ తమ యిండ్లకుఁ బోవ వెడలిరి.

గణపతిరా వందఱికంటె వెనుకఁజిక్కెను. అతని చూపు లింకను వెదకుచునే యుండెను. నాటకశాలలోని దీపము లాఱిపోయినవి. ఆవరణములో నొకచోట మాత్రము మినుకు మినుకు మనుచు నొకదీపము గానవచ్చుచుండెను.

మన న్యాయవాది ద్వారముకడకు నిరాశతోఁ బోయి యటు నిటుఁ జూడఁగా, ఆవరణమున కవతలి మూల నొక చెట్టు క్రింద ముసుకుఁ గప్పికొనియున్న వారెవరో తన్ను రమ్మని సంజ్ఞ చేయుచున్నట్లు కానవచ్చెను. ఆశాభరితమగు హృదయముతో నతఁడచ్చటికిఁ బోయి యేమిమాట్లాడుటకుఁ దోచక నిలఁబడియుండెను.

“సుందరీ! నీగుణ సంపదకును, భావౌన్నతికిని, నేను తగినవాఁడను గానని తెలిసియు నీ యాజ్ఞకు బద్ధుఁడనై వచ్చితిని. నీప్రసన్న వదనమునుజూపి నన్ననుగ్రహింపుము” అని యాతఁడు ముసుకుతోనున్న స్త్రీని వేడికొనెను. అంతనామె మెల్లఁగాఁ దన ముసుకును దొలఁగించెను. కొంతదూరముననుండిన దీపకాంతి యామె

ముఖమునఁ బ్రసరించెను. గణపతిరావు మోము వెలవెలఁ బాఱెను. కాళ్లు వడఁకసాగెను. కొంతసేపటికి ధైర్యము తెచ్చికొని యెండినపెదవులను గొంతకష్టముతోఁ దెఱచి యనెను. "ఈకొంటెతనము చేసినది నీవేనా?". ముసి ముసి నవ్వుతో గడుసుదనము దోప హైమవతి యనెను, 'నేనే".

అగ్నికుండము

ప్రథమ రంగము

ఉ. కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునే రతికేళి? జిహ్వకున్
వంటకమిందునే? యితరవైభవముల్ పదివేలు మానసం
బంటునె మానుషంబుగల యట్టి మనుష్యునకెంతవానికిన్
కంటకుఁడైన శాత్రవుఁడొకండు తనంతటివాఁడు గల్గినన్?

కాశీఖండము.

యశవంత సింహమహారాజునకుఁ బుత్రుఁడగు బృథ్వీసింహుఁడు, శౌర్యసౌందర్యాలంకృతుఁడనియు, పర్షియా, ఈజిప్టు, టర్కీ వివిధ దేశాటనార్జితానుభవకుశలుఁడనియు, ననేక భాషావిశారదుఁడనియుఁ బేర్వాసిగాంచియుండెను. ఈతని సోదరియగు రాజనందని యను నామె, రూపలావణ్యమునను, వాఙ్మాధుర్యమునను, స్వభావౌన్నతివలనను, నప్పటిరాచకన్నియలలో వన్నెకెక్కియుండినది. అపరాధ మొనర్చుట యన్న నామె కత్యంతాసహ్యము. నైతిక సమస్యలను గూర్చి యామె మహారాజాగారితోఁ బలుమాఱు వివా

దము నలుపుచుండెడిది. రాజనీతి మఱుఁగున నధర్మ
కార్యముల నొనర్పఁగటిబద్ధుఁడై యుండిన తండ్రియుద్య
మములఁ బెక్కుమారు లామె మార్చియుండెను. చిన్న
రాజపుత్ర సంస్థానమున కొక్క దానికి యువరాజై
యశవంత సింహుని సేనాంగములో నున్నతోద్యోగ
మందుండిన ధర్మసింహుఁడను పురుషసింహుని శౌర్య
సాహసాదులఁ బరికించి, వృద్ధికామునిగఁ దలంచి,
మహారాజాతనికి దనముద్దుకూతు నిచ్చి పెండ్లి చేసెను.
ఈదంపతుల యనురాగము కడుప్రశంసనీయమై యుం
డెడిది. ధర్మసింహుఁడు విశేషముగ యోధపురముననే
నివసించుచుండుటవలనఁ బృథ్వీసింహునకును నాతనికిని
గలిగియుండు ప్రేమాబంధములు మఱింత గట్టిపడెను.
వేయేల? వారిమైత్రి భ్రాతృత్వముకంటె మించిపోయెనని
చెప్పిన నందతిశయోక్తి యావంతయు నుండఁజాలదు.
రాజపుత్రులవలెనే రాజపుత్రికల కిద్దఱకును బ్రాణ
స్నేహముండెను. పృథ్వీసింహుని ధర్మపత్ని యగు దుర్గా
దేవి, మిగులశాంత స్వభావము గలదియై, నీతివర్తన
మున మిన్నగానుండెను. సామాన్యముగఁ బ్రపంచమున
నగపడు నాడుబిడ్డమఱదండ్రునకు వలెఁగాక యీజవ్వను
లిరువురకును, నొకరికై యొకరు ప్రాణము విడుచునంతటి

యన్యోన్యాను రాగమును, నిరువురకును సమానముగ సంస్కృత సాహిత్యజ్ఞానమును నుండెడిది.

ఒకనాఁడా యువతీమణు లిరువురు నుద్యానవనమున విహార మొనర్చుచుండ, దాసియొకతె రాజనందని చేతి కొకజాబు దెచ్చియందిచ్చెను. సంస్కృతమున వ్రాయఁబడియుండిన యాలేఖ నామె చదువుకొని యంపిన వారిని వెంటనే లోనఁబ్రవేశపెట్ట దాసి కాజ్ఞ యొసఁగెను. కొంతసేపటికి జీర్ణవసనధారిణి యొకర్తు ప్రవేశించుచుండుట గానవచ్చెను. ఆక్రొత్తవనిత యిరువదియైదింటికన్న నెక్కువ శరత్కాలములఁజూచియుండి నట్లగపడకపోయినను, శరీరమున వ్యాపించియుండిన పచ్చందనమును, తడిలేని పెదవులును, నామె విశాల నేత్రముల యొక్కయు, మందగమనము యొక్కయు, నెమ్మనము నాకర్షించు ముఖ లక్షణమ్ముల యొక్కయు, సొగసునణచిపెట్టి చూచువారికి “కాలవైపరీత్య మిట్టి దశకుఁబాల్పడఁ జేసినదిగాని, యొకప్పు డీమె సౌందర్య రాశియై యుండనోపు”నను నూహానుబుట్టించుచుండును. రసపుత్ర నారీమణులను సమీపించిన పిదప నాక్రొత్త జవ్వని, వినయసూచకముగ నవనత శరీరయై, వారిద్దఱ నాశీర్వదించి, సమీపమున నొక్కచోఁ గూరుచుండెను.

రాజనందని యామె నాపాదమస్తకము పరీక్షించి "మీ పేరే" మనియడుగ "వ్రజవిలాసిని" యని యామెబదులు చెప్పెను.

రాజనం:—మీదేయూరు ?

వ్రజ:— ఇచ్చటినుండీ మూఁడుదినముల ప్రయాణమున నున్న విక్రమపురమే మాపురము.

రాజనం:—సంస్కృత మెచ్చట నభ్యసించితిరి ?

వ్రజ:—అశేషపాండితీ వైభవముగలిగి యుండిన మా తండ్రియే నాకు రెండు ముక్కలు నేర్పెను.

రాజనం:—మీకు వివాహమైయుండును కాదూ ?

వివాహము మాటవెలువడఁగనే, వ్రజవిలాసిని కనుదమ్ములనుండి ముత్తియములవలె బొటబొట బాష్పములు రాలసాగెను. అయినను నామె కన్నీరు దుడుచుకొని గొంతు సవరించుకొని "అమ్మా! ఈప్రశ్నకు మఱియొక సమయమున నుత్తరము విన్నవించుకొనెదను. నాకథ యిసుక పాతరవలెఁ దఱుగనిదై, జాలిఁ బుట్టించునదిగా నున్నది. అట్టి దానిని విన్నచో మీ మనములు విషాదమగ్నములు కాక మానవు. ఇప్పటికా విషయమున నన్ను క్షమింపుఁ" డని వినయముగఁ బల్కెను.

నాఁటినుండి ప్రజవిలాసిని యచ్చటనే నివసించు చుండెను. సంస్కృతమున నసామాన్య పరిచితిగల యావిదుషీమణి యనుదినమును సుప్రసిద్ధకవిరాజుల గద్య పద్యాత్మక కావ్యముల నాజవ్వనులకు వినిపించు చుండెను. ఆమె విద్యాసంపన్నతయు, సద్విషయ నిర తియు నచిరకాలముననే రాకొమరితల హృదయమున గౌరవయోగ్యమగు నాస్థలము నాక్రమించెను.

ద్వితీయరంగము

పృథ్వీసింహ ధర్మసింహు లిరువురును మహా రాజుగారితోఁగూడ నాఫ్గనిస్థానపు దండయాత్రకై వెడ లిపోయి యనేకమాసములు గడచినవి. దుస్సహమగు నీవియోగకాలము మేఘసందేశ రఘువంశాది గ్రంథ పఠనమునం గడచుచుండెను. మహాకవికాళిదాసుని కైత యెడ నత్యంతాభిమానము గలిగియుండిన యాప్రజవిలా సిని యక్కావ్యములలోని కథావిషయముల మిగుల రసావహముగ వర్ణించుచు నొక్కొక్కప్పు డందలి విశే షాంశములను సూక్ష్మదృష్టితో విమర్శించుచుఁ దన చెలుల నానందరస తరంగిత హృదయలఁ జేయుచుండె

డిది. ఒకనాటి సాయంతనమువేళ రాజపుత్రిక లిరువురును గృహారామమున విహారము సల్పుచుండఁ బచ్చని లేఁబచ్చికపై సాశ్రులోచనయై పడియుండిన వ్రజవిలాసిని వారికంటఁబడెను. రసపుత్రజవరాంద్ర యనుగ్రహమును, వారి మర్యాదయు, వారి యవ్యాజప్రేమయు, వ్రజవిలాసిని సౌందర్యమునకు మునపటికన్న నెక్కుడు వికాసము నిచ్చియుండె. తక్కిన యిరువురితోఁ బాటామెయు రాజకన్యవలె నగపడుచుండినది. అయినను నట్టియూఁటకుఁ గారణములుండినను, నప్పుడప్పుడామె యేకాంతమునఁగూర్చుండి విలపించుచుండెడిది. నిముసమేనియు నెమ్మదినీయనంతటి కఠినభారమామె హృదయమునొత్తిపెట్టుచుండెను. తమచెలికత్తెయొక్కయప్పటి దీనావస్థకు నెంతయు జాలిఁజెంది నాజవ్వను లిరువురును నామెకడకుపోయి కూర్చుండిరి. రాజనందని యామెతల నెత్తితనతొడపై నిడికొని, గులాబిపువ్వులఁ దృణీకరించు నామె చెక్కులను దుడుచుచు, నిట్లనియె "నీమనసులోని మాట మాకేల చెప్పవు? మమ్మునింకను లాతివారిగ భావించెదవా? మమ్మువదలి నీవొక్కదానవే యిట్లు దుఃఖాగ్నిసంతప్తవగు చుండుటఁ జూచి మేము భరింపఁ జాలము".

ప్రజ:—(డగ్గుత్తికతో) అమ్మా! నేను దురదృష్టవంతు రాలను; నాకథ విన గోరవలదు.

రాజ:— నీకు దప్పుగా దోచదేని యొక్కమాట యడిగెదను.

ప్రజ: —అడుగుము.

రాజ:— క్రొత్తదేదియునుగాదు ; నాడు నేనడిగినదే; నీకు వివాహమైనదా లేదా ?

ప్రజ:— నేనేమి ప్రత్యుత్తరము చెప్పుదును! ఇంకను గాలేదు.

రాజ:— ఎవ్వరిదేని యనురాగ ఖడ్గము నీహృదయ మున నాటియున్నదా ?

ప్రజ:— చెలీ! లేదు. దేవునితోడు.

రాజ:---అట్లయిన విన్నవోయియుండుటకు గతమేమి? అనురాగామృతమును జవిగొన నిచ్చగించు చున్నావా ?

ప్రజ:--- లేదు; నాహృదయమున దుఃఖమునకు దప్ప సుఖమునకు జోటులేదు.

రాజ:---అట్లయిన మే మనురాగమునకు జో చేర్పర చెదము.

వ్రజవిలాసిని వారి నర్మోక్తిని గ్రహించి "చెలీ! దయచేసి యిప్పటి కీప్రసంగమును జాలింపు"డని బ్రతిమాలుకొనెను.

రాజ:--- ఇఁక మేము నీపరిణయ ప్రయత్నము లొనర్చెదము. దివాణజయచంద్రు నెన్నఁడయినఁ జూచితివా?

వ్రజవిలాసిని దాని కుత్తరమొసంగక కన్నీరు గార్చుచు నివ్విధముగఁ జెప్పఁదొడంగెను.

" రాకుమారీ! నే నొక వ్రతముఁ బూని యున్నాను. ప్రతిన నెఱవేర్చుకొనుటయే నాజీవితోద్దేశము. దీనికొఱకే నేను జీవించియున్నాను. కానిచో, నాకుడిచిన యిడుములు నన్ని దినఱకే విషణ్ణహృదయగఁ జేసి యంత మొదించియుండును. నాజనకుఁడు విక్రమ పురమునకు జాగీరుదారుగ నుండెను. ఆయనకు నేను తప్ప వేఱుసంతతిలేదు. కనుక నన్ను ప్రాణముతో సమానముగ గారాముగఁ బెంచుచుండెను. నాకొఱకే యాయన యనేక సంవత్సరములు కృషిచేసి సంస్కృతము నభ్యసించెను. సంగ్రామవిద్యయందారి తేఱిన వాఁడు. పలుమారు రణరంగమున శత్రువుల వెన్నుఁజూచినవాఁడు. ఒకనాఁడసురస్యంధవేళ గోగణము లడ

వులమేసి గృహోన్ముఖములై వచ్చుచుండినవి. నేను మాయింటిద్వారముకడ నిలిచియుంటిని. అంతలో నీటగు పాగాను ధరించి యాయుధాలంకృత శరీరుఁడై వీర రసావ్మాదునివలె నాయెదుట నొక పురుషుఁడు వచ్చుచుండెను. నాకుఁ గడుఁగూర్చునావు 'మోహిని' యనునది పచ్చిక బయళ్లలో హాయిగమేసి మరలివచ్చుచుండెను. దాని దూడ యటునిటు చెంగు చెంగున గంతులు వైచుచుండెను. విధివశమున నకస్మాత్తుగ నా దూడ యాపురుషుని పాదముల క్రిందఁబడి నలిగెను. ఆవు తన దూడ గతిఁజూచి తటాలున నాతనిపైకి దుమికెను. శూరుఁడగు నారసపుత్రుఁడు పాఱిపోయినచోఁ బిఱికి తనము ప్రకటనమగునని కాఁబోలు వెంటనే కత్తిఁ దూసి యావుపై కెగిరెను. గోవును లేశమేని జంకక యార్భాటముసేయుచుఁ బెనఁగులాడసాగెను. నాకట్టెదుటనే నిముసమున నాపురుషుఁడు ధేనువు ప్రాణములఁ గొనెను. అంతలో నచ్చట వందలకొలఁది జనులు గుంపులుగూడి, చేసిన దుష్కార్యమున కాతని దూఱసాగిరి. మఱియొక నిముసమున సంధ్యావందనమునకై జలాశయమున కరిగియుండిన మాతండ్రి మరల వచ్చి చూచు వఱకు వాకిటియందు జనులు తండోపతండములుగ

నగపడిరి. గోవు ప్రాణావసానస్థితి యందు గిజగిజఁదన్నుకొనుచుఁ బడియుండుటయు, దూడకంట నీరుగార్చుచుండుటయు, నాయనకన్నులారఁజూచెను. ఆయన కంఠధ్వని వినఁగానే యావు దుఃఖావేశమును బ్రకటించునట్లు బిగ్గరగా నఱచి జాలిఁగొలుపువడువునఁ దన దృష్టిని యజమానునిపైఁ ప్రసరింపఁజేసెను. మానాయన కత్యంత ప్రేమాస్పదమగు వస్తువులలో నాతరువాత నదియే ముఖ్యమైనదని మీరెఱుంగుదురుగాక! కనుక క్రోధావేశపరవశుఁడై 'నాయావును గొట్టినవాఁడెవఁ'డని దిక్కులు ప్రతిధ్వనించునటులు ప్రశ్నించెను. యావనుఁడు సిగ్గుచేఁదలవాల్చి ముందఱకువచ్చి "నేనే" యని పల్కెను.

మాతండ్రి:— అయినచో క్షత్రి నొక్కని మార్కొన సిద్ధముగ నున్నదా?

రాజపుత్రుఁడెఱ్ఱవారిన మోముతో 'క్షత్రియుఁడెవ్వఁడేని నన్నెదుర్కొన సిద్ధముగనున్నచో నాకభ్యంతరములే'దని బదులిచ్చెను.

అచ్చట నిలచియుండిన వేలకొలఁది జనులలో నొక్కని కైనను నారాజపుత్రు నెదుర్కొను ధైర్యము కలిగినదికాదు. అదిచూచి మానాయనయే ఖడ్గహస్తుఁడై

యాతని నెదుర్కొనెను. అతఁడును గరవాలమును గైకొని ముందడుగిడెను. ఇట్లిద్దఱును బోరునకు డీకొనిరి. అయినను నిద్దఱిలో మాతండ్రి వయసు ముదిరినవాఁడగుటచేత వక్షమునఁ దగిలిన గాయమునకుఁ గ్రింద వడఁగా నాయనను లోనికిఁగొనివచ్చిరి. ఆయన ముఖము పచ్చబారినను, నాగ్రహాగ్నికణమ్ములు చేటలఁ జెఱఁగినట్లు నేత్రములనుండి వెడలుచుండెను. ఏడ్చుచు నెదురుగావచ్చినిలచిన నన్నుజూచి, మాతండ్రి యందఱును నవతలకుఁ బొమ్మని కనుసన్నఁజేసెను. మేమిద్దఱ మేకాంతముగనున్నప్పుడాయన నన్నుఁజూచి "అమ్మాయీ! నీవు రసపుత్ర స్త్రీవికదా?" యనెను.

నేను:—అయ్యా! అవును.

తండ్రి:— రాజపుత్రులు ప్రతిజ్ఞా నిర్వాహణవ్రతులు గదా?

నేను:—అవును.

తండ్రి:—నాయావు ప్రాణముల నపహరించిన క్షత్రియునిపై నీవు పగతీర్చుకొనవలయును.

నేను:—అయ్యా! తమ యాజ్ఞనడిపెదను.

తండ్రి:—నాకుమారుఁడు బ్రతికియుండినపక్షమున నీప్రతిజ్ఞాభారము నీతలపైఁ బడియుండదు.

నేను:—తమయాజ్ఞను నెఱవేర్చి తీరెదను.

తండ్రి:—నీవట్లు నాకభయవచన మిచ్చెదవా ?

నేను:—నిస్సందేహముగా.

తండ్రి:—నీవు ప్రతిజ్ఞనుచేసి చూపుదువని నేను నమ్మ వచ్చునా ?

నేను:—నా ప్రాణములుండినచో నెఱవేర్చితీరెదను.

తండ్రి:—ఇదిగో. ఈకటారును గైకొనుము. ఎంత వఱకు నీవా క్షత్రియుని హృదయమును దీనితో ప్రయ్యలుచేయవో యంతవఱకు నీవు సర్వ సుఖ త్యాగినివిగా నుండవలయును.

ఈమాటలతో మాతండ్రియాత్మ పరలోకము ననుగమించెను. నేనును నాఁటినుండి యోగినీవేషధారి ణినై యాకటారు నుడుపులక్రింద గుప్తముగ నుంచు కొని యాక్షత్రియ యౌవనునికై దేశమంతయు గాలించు చుంటిని. అనేకవత్సరముల వఱకు నొకప్పుడు జనా వాసములందును మఱొకప్పు డరణ్యములయందును, నివసించుచుఁ గ్రుమ్మరుచుంటిని. కాని యాపురుషుని జాడ యగుపడలేదు. ఒకనాఁడు నిర్జనప్రదేశమునఁ గూ ర్చుండి నాదురదృష్టమును దలపోసి దుఃఖించుచుండ, నాయౌవనుఁ డెచటనుండియో నావైపు నడిచివచ్చుట

గానఁబడియె. అతఁడు సమీపించి నన్నుగాంచి "నీవెవ"
రని విచారించెను.

నేను:—నేను దీనురాలనగు నొకబ్రాహ్మణిని. కరు
ణించి నాకేమైన నాహారమిడుఁడు.

క్షత్రి:—అట్లయిన నావెంటరమ్ము.

నేను లేచినిలచి యతఁడేమఱి యుండిన సమయ
మునఁ దటాలునఁ గటారుఁదూసి యాతనిరొమ్మునఁ
గ్రుమ్మితిని. అంతలో ననేకు లచ్చటికి వచ్చుచుండుట
కానరాఁగా భయాకులచిత్తనై కటారుఁ బాఱవైచి పరు
గెత్తితిని నాఁటినుండి మూఁడేండ్లవఱకు పర్వతారణ్య
ములలోఁ డాఁగియుంటిని. ఏనాఁతిలోనైననుబడి యసు
రులువాయ పెక్కుమారులు నాకుఁదోచెను. కాని,
ప్రాణములు కడుతీపులు సుమా ! ఇంక ముందేమేమి
యనుభవింప వలసియున్నానో కాని యిప్పటివఱకు
నాకుఁ జావురాలేదు. వనవాస జీవనము కొంతకాల
మునకు వెగటుగదోచి, జోధపురమువచ్చి, తమ దీనా
వన తత్పరత్వమును జెవులపండువుగ వింటిని. తమసేవా
భాగ్యమును బడసిన యానాఁటినుండియు భవత్కృపా
విశేషమున సుఖముగ జీవించుచున్నాను. ఇదియె
క్లుప్తముగఁ జెప్పబఁడిన నాయుదంతము."

ఈ వృత్తాంత మంతయును విని రాజనందని దీర్ఘ నిశ్వాసముతో "ఓహోహో! ప్రపంచమం దెంతటివార లున్నారు. అదియట్లుండె. నీకట్టి రాతని ప్రాణములఁ బాపియుండునా"? అనెను.

ప్రజ:—ఎక్కడనమ్మా? అతఁ డుతప్పించుకొనఁగల్గెను. గాయము తప్పితగిలెను. పిమ్మటఁ గొంతకాల మునకట్టి యాకారమేగల యావనుఁ డొకఁ డడవిలో వేటాడుచు నాకగుపడెను. అతఁడో కాఁడో చెప్పఁజాలను; కాని వారిద్దఱి రూప ములు నచ్చున గ్రుద్దినట్లొక్కతీరున నున్నవి.

తృతీయ రంగము

ఈ సంగతులుజరిగి యనేకమాసములు గడచెను. ప్రజవిలాసినికథ విన్న నాఁటనుండి రసపుత్ర నారీరత్నము లామెయెడ మునుపటికన్న నెక్కువప్రేమను, గనికర మును జూపసాగిరి. మున్ను చనవుచే నామె నప్పు డప్పుడు విసిగించుచుండిన యాజవ్వను లిపుడామెను సర్వదా యూఱడించుచుందురు. ఆకాశము మేఘాచ్ఛా దితమై గడునానంద దాయకముగనున్న యొకనాఁడు, రాజనందని "వర్షర్తు"ను గూర్చిన మనోహర వర్ణనము

గల పొత్తము నొకదాని విషయమునఁ బ్రశంసించి దానిఁ జదువఁగోరెను.

వ్రజ:---అది నిజముగా నమూల్యగ్రంథము చెలీ! నీ ప్రక్కనున్న యలమారునం దాపుస్తకమున్నది. కొంచెముతీసి నాకందిమ్ము.

వ్రజవిలాసిని యాగ్రంథమునందికొనివిప్పి, మొదటి పుట మరలింపఁగానే పుస్తకమామెచేతినుండి జారిక్రిందఁ బడెను. ఆపుట నలంకరించు చుండిన ప్రతిమ తన తండ్రినిజంపిన పురుషునిదిగ నామెకుఁదోఁచెను. దానిఁ జూచినతోడనే యామెకన్నులనుండి యగ్నిజ్వాలలు వెడలసాగె. లలాటమున ముడతలుపడెను. తనప్రతిజ్ఞ జ్ఞప్తికివచ్చెను. కాని యంతలోనే "యతనిప్రతిమ యిచ్చటి కేల వచ్చియుండును? ఆపురుషుని కీ రాకొమరితలతో నెట్టి సంబంధమున్నది? కృతజ్ఞతాభారమునకులోఁగి నాప్రతిజ్ఞ నుల్లంఘింపవలసి వచ్చునాయేమి?" యను విచార పరంపరయామె మనస్సును వేధించెను. రాజ నందని తనచెలి మోమువంకఁజూచి "సఖీ! ఏల యీ యాగ్రహ"మని యడుగ వ్రజవిలాసిని మెల్లన"నేమియు లేదు, కొంచె మేదో మనోవైకల్యము తప్ప మఱేమియు లే"దని ప్రత్యుత్తరమిచ్చెను.

ఇదివఱకున్నది కాక నాటినుండి ప్రజవిలాసిని కొక క్రొత్తవిచార ముద్భవించెను. 'కృతజ్ఞతాభారము నన్నుఁ బ్రతిజ్ఞనుల్లంఘింపఁ జేయునాయేమి' యను నదియేయది.

చతుర్థ రంగము

పదునాఱుమాసములు పూర్తిగఁ గడచిన పిదపఁ బృథ్వీసింహ ధర్మసింహు లాఫ్గనిస్థానమునుండి మరలిరి. చక్రవర్తిసేనలాదండయాత్ర యందుఁజాల నిడుములఁ గుడువవలసి వచ్చెను. మార్గమధ్యమున మంచుగడ్డలు కురియఁజొచ్చెను. పర్వతపు కనుమలు హిమమయములై రాకపోకల నడ్డగించెను. వస్తుసామగ్రులు క్రమముగాఁ దగ్గిపోయె. సైనికులు పస్తుండవలసి వచ్చెను. ఈస్థితి గతుల లాభముగొని యాఫ్గనులు చక్రవర్తిసేనల నురు మాడఁ జొచ్చినందున యువరాజగు మొహియుద్దీనుఁడు భగ్నమనోరథుఁడై వెనుకకు మరలి రావలసివచ్చెను.

యోధపురము సమీపించిన కొలఁదిని, రస పుత్రవీరు లిరువురు మనములును నాతురతఁ బొడి సంతో షమున మునింగెను. ఇన్నినాళుల వియోగము తరు

వాత లభింపనున్న సంయోగ సుఖాశ వారియానం దమును మేరమీఱఁ జేసెను. రాత్రియనక పగలనక మార్గాయాసమును దలంపక వారు వడివడిగఁ బ్రయాణము సల్పసాగిరి. వారికిద్దఱకు బలమైన గాయములు తగిలియుండినను బ్రియజన దర్శనా భిలాష వారికి బాధను స్ఫురింప నీయ లేదు. పృథ్వీసింహుఁడు తనమనోనాయకికై అస్ఫహాను నగరపు కటారునొక దానిఁ దెచ్చెను. ధర్మసింహుఁడునునట్లే పత్నికై కాశ్మీర శాలువు నొక్కదానిఁగొని వచ్చెను. ఇరువురును దమ వారినెప్పుడు చూతుమా యను నుత్కంఠ చేఁ దొందరపెట్టఁ బడుచుండిరి.

రాజకుమారుల యాగమనవార్తవినిన రాకొమరితల సంతోషము వర్ణనాతీతమై యుండెను. శరీరములు భూషణములతోను, పాపటలు ముత్తెపుఁజేరులతోను నలంకరింపఁ బడసాగెను. వారి వదనారవిందములు ప్రియవార్తా శ్రవణముచే వికసించెను. ఒకరి నొకరు వేళాకోళము చేసికొనుటయు, మరల పరస్పరాలింగనమొనర్చుకొను చుండుటయు, జరుగుచుండెను.

ఆశ్వీజమాసమున నొకనాఁడు యోధపుర దుర్గమునుండి వెడలు స్వాగతసూచక శతఘ్నినినాదములు దిక్కులఁ బిక్కటిల్లఁ జేసెను. పృథ్వీసింహుఁడు సురక్షిత

ముగ నాఘనిష్ఠానమునుండి మరలివచ్చె ననువార్త నగర మందెల్లెడల నల్లుకొనియె. రాకొమరిత లిరువురును పళ్లెరముల హారతిద్రవ్యముల నిడుకొని యంతఃపుర ద్వారమునఁ బ్రతీక్షించు చుండిరి. పృథ్వీసింహుఁడు సభ్యులొనర్చు మర్యాదలఁ గొనుచు నంతఃపుర ప్రవేశము చేయఁగానే దుర్గాదేవిభర్తకు హారతి యిచ్చెను. దంపతులచూడ్కు లన్యోన్యాలింగనము చేఁ దృప్తిఁబొందెను. శౌర్యగర్వముతో ధర్మసింహుఁడు మందిరాంగణము లోనికిరాఁగానే తుమ్ము వినవచ్చెను. ఎడమ కన్నదర సాగె. అంతలో హారతిబూని యత్యాతురముతో వచ్చుచుండిన రాజనందని కాలుజాఱి పళ్లెరముక్రిందఁ బడెను. ధర్మసింహుని మోము వెల్లఁబారె. రాజనందని ముఖకమలము వాడ్పుఁజూపె. ఈ దుశ్శకునమున కర్థమేమైయుండును?

పంచమ రంగము

రసపుత్ర వీరులింటికివచ్చిన వార్తవిని ప్రజవిలాసిని వారిద్దఱను గురించియు నభివందన రూపముగ సరస పద్యాళిరచించి యుండెను. కనుక మరుసటియుదయమున పృథ్వీసింహుఁడు కాల్యకృత్యముల నిర్వర్తించు

కాని తిరిగి కూర్చుండు వేళ నామె యాతనిసమ్ముఖ మునకువచ్చి కుశనిర్మితమగు చక్కనిపాత్రమున నా కవితారూపకాభినందనపత్రిక నునిచి యర్పించెను. పృథ్వీసింహుఁడెంతయు సంతసించి దానినంగీకరించె. పత్రికయందలి కవిత్వమంత ప్రౌఢముగ నుండకపోయి నను భావ సౌష్ఠవముచేతను, పొంగి పొరలు రసముచే తను, నది మిగులరమ్యమై యొప్పారె. కవితారసలోలుఁ డగు పృథ్వీసింహుఁ డాపద్యములఁ జదివి యానందించి మేలుముత్తియముల హారము నావిదుషీరత్నమునకుఁ బారితోషికముగ నొసంగెను.

అచ్చటినుండి వెడలి యాముద్దియ ధర్మసింహుని కడకరుగు దెంచువఱకు నతఁడు సుఖాసీనుఁడై రాజనంద నికి యుద్ధవార్తలు వినుపించు చుండెను. వ్రజవిలాసిని దృక్కులాతనిపైఁ బ్రసరింపఁగనే యాశ్చర్య చరితయై యప్రయత్నముగ వెనుకకుఁ దగ్గెను. ఆమెముఖము నవ లోకింపఁగనే ధర్మసింహునిమోము సహితము వెల వెలఁ బారెను. పెదవులెండెను. కాలుసేతులు తడఁబడఁ జొచ్చెను. వ్రజవిలాసిని వెనుకకుఁ దగ్గినది తగ్గినట్లె మరలి పోయెను. ధర్మసింహుఁ డుత్సాహమంతయుఁ గోల్పోయి మంచముపై నొరిగి హస్తద్వయముచేఁ గన్నుదోయి

మూసికొనియె. ఈ వికారదశను బరికించుచుండిన రాజనందనియొక్క కుసుమకోమల గాత్రము చెమటయందు మునిఁగెను.

ధర్మసింహుఁడా దినమంతయు నల్లిమానముగఁ బరుండి శయ్యపై నిటునటుఁ బొరలాడుచుండెను. చిరకాల వ్యాధిగ్రస్తునివలె నాతనిముఖము వన్నెతఱిగెను. పగలీవిధముగఁ గడపి, రాత్రిమార్గాయాస వ్యాజమున నాతఁడు సత్వరమె నిదురించెను. పాపము! రాజనందనికా మనోవైకల్య కారణమేమియుఁ దోఁపలేదు. "వ్రజవిలాసిని దప్పిగొని యున్న దీయనరక్తమునకే కాదుగదా? నామనోనాథుఁడు నాజ్ఞాననిధియగు ధర్మసింహుఁడంతటి కాఠిన్యమును వహించియుండుట సంభవమగునా? అసంభవ మసంభవ"మని పలుమాఱు వితర్కించుకొని తనచేష్టాచమత్కృతిచే నాతని మనోవ్యాధిని దొలగింపనెన్నియో యత్నములొనర్చెను. కాని, వ్యర్థమయ్యెను. తుదకామెయు నిద్రాదేవతయొక్క యనివార్య ప్రభావమునకు లోనై కన్గన మూసికొనెను. రాతిరి చాలప్రొద్దుపోయినది. గగనకాంత యంధకారవసనములోఁ దనవదనమును గప్పికొనెను. అప్పుడప్పుడు సారసపక్షియొక్క వ్యసనకరమగు ధ్వనియును,

దుర్గమునుగాచు రక్షకభటుల జాగ్రత్తోద్బోధకారావములును దప్ప మఱేమియు వినవచ్చుటలేదు. రాజనందని కకస్మాత్తుగా మెలఁకువవచ్చి చూడ ధర్మసింహుఁడు శయ్యపైనఁ గానఁబడలేదు. హృదయము భయవిహ్వలమయ్యె. విద్యుద్వేగమున లేచి వ్రజవిలాసినియుండు గదివైపునడచి తద్ద్వారమున నిలచి తొంగిచూడ నామె సంశయము యథార్థముగ మాఱెను. చూచుఁగదా వ్రజవిలాసిని ఖడ్గపాణియై నిలచియుండ ధర్మసింహుఁడు కేలుమోడ్చి యామెయెదుట నిస్సహాయునివలె మోకాళులపై నిలచియుండెను.

ఈదృశ్యము నవలోకింపఁగానే రాజనందనికి పిడుగుపడినట్లయ్యె; తల దిమ్ముపట్టెను; కాళులు తడఁబడఁ జొచ్చెను. నిశ్చేష్టయై, క్రిందఁబడుదునేమో యని యామె కనిపించెను. అయిననెట్లో తనగదికి మరలవచ్చి ముఖమున వస్త్రమును గప్పికొని పరుండెనేకాని యొక్కయశ్రుబిందువేనియు నామెనేత్రముల నుండి వెడలలేదు.

షష్టమ రంగము

మరునాటి వేఁకువను పృథ్వీసింహుఁడు ధర్మసింహునికడ కేఁగి చిఱునగవుతో “భయ్యా! నేఁటిదినము కడురమణీయముగ నున్నది. వేఁటకుఁ బోవుదమువచ్చెదవా?” యని ప్రశ్నించెను.

ఏదో విచారమున మునింగియున్న ధర్మసింహుఁడు తలయెత్తి యుదాసీనతఁబూనియున్న ముఖము నాతనివైపు త్రిప్పి “ఏమంటివి?” అని యడిగెను.

పృథ్వీ:—వేఁటకుఁబోవుదము వచ్చెదవా?

ధర్మ:—అట్లేపోవుదము.

అంత నాశూరు లిరువురును గుఱ్ఱముల నాయత్తము చేయించుకొని మృగయార్థ మేఁగిరి. పృథ్వీసింహుని వదనము కమలమువలె వికసించియుండి ప్రతిపాదన్యాసమునను నాతని జాగరూకతను జుఱుకుఁదనమును వెల్లడిచేయుచుండెను. కాని ధర్మసింహుని మోము విగతప్రాణునివలెఁ గళాహీనమై కన్పట్టుచుండెను. పృథ్వీసింహుఁడనేకపర్యాయము లాతనిఁ బ్రసంగమునకుఁ బురికొల్పిచూచెనుగాని యత్నము కార్యకారిగాక తనమిత్రుని మనోవ్యథయట్లేయుండ, దానునుమానముతోనే నడి

చెను. ఇట్లు కొంతసేపు ప్రయాణముచేసి వారొక సర స్తీరమును జేరిన తరువాత ధర్మసింహుఁడు తటాలున నాగి, మిత్రునితోఁ "గడచినరాత్రి నేనొక ఘోర ప్రతిజ్ఞచేసితిని" అని పలికెను. ఈమాట లనునప్పు డాతని నేత్రము లశ్రుపూరితములై యుండె.

పృథ్వీ:—(భయభ్రాంతుఁడై) అది యెట్టి ప్రతిన?

ధర్మ:—విని యుందువుకదా వ్రజవిలాసిని యుదంతమును?

పృథ్వీ:—అవును.

ధర్మ:—ఎవ్వఁడామె తండ్రిని వధించెనో యాతని నరక గామిఁ జేయఁ బ్రతిజ్ఞవట్టితిని.

పృథ్వీ:—సెబాస్! నీవు నిజముగ వీరపురుషోచిత మగు ప్రతిన యొనరించితివి.

ధర్మ:— అవునదియట్టిదే; కాని నెఱవేరవలయును గదా! నీయభిప్రాయమేమి? అట్టివాఁడు కంఠము తెగనఱుకఁదగినవాఁడా కాఁడా?

పృథ్వీ:—సందేహమేమి? అట్టి దుర్మార్గుని కంఠము మొండికత్తితో నఱుకఁదగును.

ధర్మ:— అవును. నేనును నట్లె తలంచుచున్నాను. ఏదేని కారణమువలన నే నాప్రతిజ్ఞను నిర్వహింపలేక పోయితినేని నీవాకార్యమును జేసెదవా?

పృథ్వీ:—ఆహా! సంతోషపూర్వకముగఁ జేసెదను. నీవాతని నెఱుంగుదువుగదా?

ధర్మ:—బాగుగ నెఱుంగుదును.

పృథ్వీ:—అట్లయిన నాసత్కార్యము నన్నే చేయనిమ్ము. పాపము నీ కాతనిపై జాలిపొడము చున్న ట్లున్నది.

ధర్మ:—మంచిది; కాని జ్ఞప్తియందుంచు కొనుము. అతఁడు మంచి యదృష్టవంతుఁడు. పలుమారులు మృత్యుముఖమును దప్పించుకొన్నవాఁడు. కనుక నీహృదయమును కఠినింపఁజేసినను గఠినింపఁగలఁడు. అతని యమసదనమునకుఁ దప్పక పంపెదనని శపథముచేయుము.

పృథ్వీ:—నేనాతనిఁ గనికరింపను. దుర్గతోఁడు! ఆతని రక్తముచే నాకరవాలఁపు దాహము దీర్పక విడువను.

ధర్మ:—మన మిద్దఱముగలసి యీదండయాత్రను నడుపుదము. నీచేసిన వాగ్దత్తమును క్రియారూపమున నొనర్చెదవుగదా?

పృథ్వీ:—ఏల యీప్రశ్న? నేను క్షత్రియుండను గానా? ఒక మారువచన మిచ్చిన తరువాతఁ

ప్రాణములుపోయినను నన్నుమాటనెఱవేర్పిగాని యూరకుండను.

ధర్మ:—తప్పక యట్లేచేయుదువు గదా?

పృథ్వీ:—తప్పక యట్లేచేసెదను.

ధర్మ:—అతఁడొకవేళ నీమిత్రుఁడై యుండుట తటస్థించినచో.

పృథ్వీ:— (ధర్మసింహుని ముఖమును బరీక్షించు చూడ్కులతోఁజూచి) మిత్రుఁడైనచో నా ...

ధర్మ:—అవును. అతఁడొకవేళ నీబంధువు కావచ్చును. అప్పుడో?

పృథ్వీ:—(ఉత్సాహముతో) ఎవఁడైనను గానిమ్ము. నాసోదరుఁడైనను ప్రాణములతో వానిని వదలను.

ధర్మసింహుఁడంతవారువముడిగ్గి వాడినమోము దమ్మితోను, ప్రకంపితములగు నోష్ఠములతోను, నడుమనున్నకటారు విప్పినేలపైఁబెట్టి, పృథ్వీసింహునితో నెలుఁగెత్తిచెప్పెను. "పృథ్వీసింహా! జతనమునునుండుము. ఆచెనఁటి మనకు దొరకనే దొరకెను!"

పృథ్వీసింహుఁడు త్రుళ్లిపడి యటునిటుఁజూచెను గాని ధర్మసింహుఁడు తప్ప మఱెవ్వరును నాతనికి దృగ్గోచరులు కాలేదు.

ధర్మ:—నీకటారు నోఱనుండి లాగుము.

పృథ్వీ:—నాకాతఁడు పొడకట్టనేలేదు.

ధర్మ:—అతఁడు నీయెదుటనేయున్నాఁడు. ముష్కరుఁ
డగు నాహంతకుఁడు ధర్మసింహుఁడే.

పృథ్వీ:—(బెదరి) ఆ! అంతటి కటిగుండెయా!

ధర్మ:—క్షత్రియుఁడవేని ప్రతినఁ బాలించుకొనుము.

ఈవాక్యము చెవినిబడఁగానే పృథ్వీసింహుఁడు నడుమునకు బిగింపఁబడియుండిన కటారును తెప్పపాటున దూసి, విద్యుత్కాంతులతో మెఱపించి, దాని ధర్మసింహుని రొమ్మునఁ గ్రుమ్మెను. రక్తము చిమ్మనగొట్టము నుండి వెడలునట్లు ప్రవహింపసాగెను. ధర్మసింహుఁడట్టి స్థితియందు నేలపైఁబడి యుండి మంద స్వరముతో నిట్లనియె. "పృథ్వీసింహా! నేను నీకెంతయుఁ గృతజ్ఞతాబద్ధుఁడనై యున్నాను. నీవు నిజమగు వీరశిరోమణివి. నీవు వీరపురుషోచిత ధర్మమును బురుషోచితముగ నెఱవేర్చితివి!!"

పృథ్వీసింహుఁడీమాటలను విని, నేల పయిఁబడి విలపింపఁదొడఁగెను.

సప్తతరంగము

చదువరులారా! నేఁడు రాజనందని సహగమనము చేయనున్నది! ఆమె శరీరము వివిధాలంకార శోభితమై యున్నది! పాపట ముత్తియముల హారములతోఁ గప్పఁబడి కానవచ్చుచున్నది! ముంజేతిని వైవాహిక కంకణ మమరియున్నది! పాదమున నెఱ్ఱనిలత్తుక యొప్పుచున్నది. శోణచేలముల నామె కైసేసినది! ఘుమ్మఘుమ్మను నత్తావులామె దేహమునుండి వెడలి వాతావరణము నాక్రమించినవి. పరలోకగమన ప్రయాణమున కామె సేసికొనిన సన్నాహములను మీమనోవీధియందుఁ దిలకింపుఁడు!!

ఆమె ముఖము సంపూర్ణచంద్ర బింబమువలెఁ దేజోవంతమై చూచు వారి మనముల భక్తిభావపూరితములుగఁ జేయుచున్నది.

ప్రేమాతిరేక మామె నున్మత్తగఁజేసినది. ఆమె దృగాకాశమునుండియధ్యాత్మిక తేజముగురియుచున్నది. ఆమెనడక యెంత గంభీరముగనున్నది! తనప్రియకాంతు నొడిలో నిడికొనివచ్చి, మంచిగంధముతోను బరిమళములఁ జిమ్ము మాలికలతోను, సాంబ్రాణి

తోను జేర్పఁబడిన చితిపైఁగూర్చుండి యున్నది! చూడుఁడు!! చూడుఁడు!!!

ఈ విషాదాంత దృశ్యమునుఁజూడ నగరవాసులందఱుగుంపులుగూడుచున్నారు. వాద్యములు మ్రోగుచున్నవి. పుష్పవృష్టి గురియుచున్నది!! ఇవ్విధముగ నావీరపత్ని చితినెక్కువఱకుపృథ్వీసింహుఁడు పఱువున వచ్చి హస్తద్వయమును మోడ్చి 'నారీరత్నమా! నాతప్పుమన్నింపు' మని వేడెను. 'క్షమింపవలనుబడదు. నీవొక రసపుత్రయూవనుని యుసురులుగొన్నావు. నీకును నట్టి యకాలమృత్యువే ప్రాప్తించు'నను ప్రత్యుత్తరము వినవచ్చెను. అంతలో నగ్నిజ్వాల లాకసమునంటి మండెను. జయజయారావములు హెచ్చెను. సంధ్యారాగ మస్తమయ భానునివలె నగ్నిజ్వాల లందామె వదనము ధాళధళ్యముతోఁ బ్రకాశించెను. కొంచెము సేపటిలో నచ్చట బూదిరాసి తప్ప మఱేమియు నగపడలేదు.

ఆహా! ఎట్టి ధార్మికోదాహరణము! ఎట్టి విషాదకరమగుకథ! అబ్బబ్బా! అపరాధపు టగ్నియెంత తీక్షణమైనది! దానిజ్వాలలెంత ప్రాణోపద్రవ కరములు! ఒకయపరాధమెన్ని ప్రాణముల మ్రింగెనో

చూడుఁడు? రాజవంశజులగు నిద్దఱు యౌవనులును, నిద్దఱులావణ్యవతులును నీయగ్నికుండమున నాహుతులైరి. ఏలయన, నీపనిజరిగిన యేడువారములలోనే పృథ్వీసింహుఁడు సైతము ఢిల్లిలోఁ జంపఁబడుటయు దుర్గాదేవి తనయుసురులఁ జిఱియను యజ్ఞవేదికపై బలియిడి భర్తననుగమించుటయు సంభవించెను. మహాపతివ్రతయగు రాజనందని శాపముఫలించెను. వ్రజవిలాసిని యేమయ్యెనో నేఁటివఱ కెవ్వరును నెఱుంగరు.

నాఁడు నీపంతము! నేఁడు నాపంతము!

ప్రథమరంగము

చ. ధరను బరోపకార సుకృతంబును బోలవు పుణ్యముల్ మనో
హరతర వస్తువు ల్గుణలయాత్ములకన్నను గల్గవెవ్వియున్!

భర్తృహరి-

శ్యామసుందరుఁడు పాటలీపుత్ర వాసియగు నొక యౌవన న్యాయవాది. అతఁడు, శారీరిక మానసికాది సర్వశక్తులను వాగాడాంబరమునఁ బ్రకటించుచు నాగరక సంఘములలో నగపడు ప్రాయంపు యువకులవంటి వాఁడుగాఁడు. అతఁ డుత్సాహ భరితుఁడు; చెప్పుటకన్నఁ జేయుటయం దెక్కువ యాసక్తి కలవాఁడు. తాను మనఃపూర్వకముగ నమ్మిన తత్త్వముల నాచరింపక వదలుటగాని, స్వార్థపరాయణత్వముచేతఁ దన యభిప్రాయములను మార్చుకొనుటగాని, యాతఁడెఱుఁగఁడు. పలుకార్యములం దొక్కపుడే ప్రవేశించుట యాతనికిసరిపడదు. పదిపనులలో దిరుగువాఁ డొకకార్యము నేనియుఁ బూర్తిగ నెఱవేర్చుట యరుదు. పదిసంఘముల కార్యదర్శిగను, పదిసభల

కర్తవ్యజ్ఞుఁడుగను నుండు మానవుఁడు క్రియాపూర్వక
ముగఁ దనవిధుల నెఱవేర్చుననునాశ, విచారశూన్యు
లగు వారికుండిన నుండవచ్చునుగాని దూరదృష్టి గల
వాఁ డెప్పుడును నట్టియాశకుఁ జోటియ్యఁడు. అటువంటి
వాని యావచ్ఛక్తియు వాగ్రూపమున నెగిరిపోవును. మన
న్యాయవాది యీరహస్యమును బాగుగ్రగహించినట్లుఁ
దోఁచెడిని. అతఁడు నిమ్నజాత్యుద్ధరణమునకై చిన్న
సంఘము నొకదాని స్థాపించి, తనకుఁదొరకు విశ్రాంతి
సమయమునఁ దనయాదాయములోని యొకభాగమును,
నా సత్కార్యమున కర్పించువాఁడు. సాయంతనము
న్యాయస్థానమునుండి యింటికి వచ్చినతోడనే యఁల్పా
హారము భుజించి, తన ద్విచక్రికను(బైసికలు) బయటికిఁ
దెచ్చి, పురపరిసరముననున్న గూడెములకుఁ బోవును.
పోయి, యచ్చటి హీనదశావశులతోఁ గూర్చుండి, వారి
బాగోగులనుగూర్చి సంభాషించుచు, నీతివర్తనమును
గూర్చి వారి కుపదేశించును. వారి బాలురరప్పించి, బుజ్జ
గించి యేమైన ఫలాహారముల నొసంగును. ఆదివారము
గాని, మఱి యేదేని విశ్రాంతిదినముగాని, వచ్చినప్పుడు,
యక్షిణీదీపము(మాజికులాంతరు) సహాయమున వారికి
వినోదముగలిగించును. శ్యామసుందరుని యీ సహాయ

భూతి సుమారొక సంవత్సరకాలముననే యా ప్రాంతము లందు వసించుచుండిన హీనజాతులవారి జీవన విధాన నమున నెంతో మార్పుకలిగించెను. మృతజంతు మాంస మును భుజించుట మానిరి; మద్యపానాభ్యాసము పూర్తిగఁ బోకపోయినను, దత్పానమూలమున జరగు నేరముల సంఖ్యక్రమముగా క్షీణించుచుండినందున నా రక్షకపర్యవేక్షకునకు(పోలీసు ఇనస్పెక్టరుగారికి)మాత్ర మిబ్బందిగ నుండెను.

మన న్యాయవాది, అంటరాని తరగతుల వారి యందుఁ గ్రమముగా భ్రాతృభావము నెలకొల్పెను. ఆ ప్రాంతములనున్న మూఁడువందల గ్రామములలో నివసించు నాలుగువేల యంత్యజులపైనను, నతనికి భ్రాతృ ప్రేమ కలిగియుండె. వారి యిండ్లలోని వివాహములకుఁ బోయి, తాంబూలముఁ గొనుచుండువాఁడు; వారిలోఁ గలిగిన వివాదముల నాతఁడే న్యాయముగఁ బరిష్క రించువాఁడు; వైద్యశాస్త్రమందు దించుక ప్రవేశము గల వాఁ డగుటచేత సామాన్యస్థితులయందుఁ దానే వారి కౌషధముల నిచ్చును. నిరుపేదలగు వారికిఁ దన స్వంత ద్రవ్యముతోఁ జికిత్స చేయించుచుండును. అయినను, సాధారణముగ నిట్టి స్థితులందు నాతని యాదరణమే

వారిని సంతృప్తమనస్కులగఁ జేయుచుండెడిది. పరోప కారమున, స్వార్థరహితమగు ప్రేమయు, స్వజాత్యభి మానమును, నెంత యవసరములుగ నుండునో, ద్రవ్య సహాయ మంత యవసరముగ నుండదు. శ్యామసుంద రుని యిట్టికృషివలన వారాత్మ గౌరవము నేర్చుకొనిరి. ప్రథమమునఁ గొందఱు భూస్వాములకు వారియం దుద యించిన యీ మార్పు కోపకారణ మయ్యెను; కాని చేయునదేమియు లేక యూరకుండిరి. ఆరక్షక శాఖోద్యో గస్థులు వారిపై నొక కన్నునిడియే యుండిరి. కాని, రిక్తులగు వారి నేమియుఁ జేయజాలకపోయిరి. ఇవ్విధముగ మన న్యాయవాదికి వారితోడి సంబంధము ప్రబలము కా సాగెను. తుదకొక్క నాఁ డతఁడు నాయకునింట జరిగిన వివాహ సందర్భమున, వారితోఁ గలసి భుజించెను.

ద్వితీయ రంగము

శ్యామసుందరుని భార్యపేరు కమల. హిందూ స్త్రీలకు సహజమగు పతిభక్తి యామెకును మనఃపూ ర్వకముగ నుండెను. విద్యాసంపదయంతగా లభింపక పోయినను, కమల, భర్తసహవాస ఫలితముగ సాం

ఘిక దేశీయ సమస్యలనైజము లెఱింగియుండెను. మానవ జన్మకు సహజమగు దౌర్బల్యమనుఁడు; లేక యామె స్వభావ దోషమనుఁడు. ఎట్లయిననేమి, యామెకు సహనశక్తి విశేషము లేదు. వాక్పారుష్యము నామె యెఱుఁగదు; ముక్కోపియుఁగాదు. అయినను, హృదయమునఁ గ్రుచ్చుకొను మాటగాని, యెకసక్కెముగాని, యామెకత్యంత బాధకరముగ నుండును. ఇట్టి మాటల నెవరేనియనిన వినును; ప్రత్యుత్తర మిచ్చుట నామెయెఱుఁగదు. కాని యిట్టిస్థితులందు లోలోనఁ దలపోయుచుఁ గృశించుట యామెకలవాటు. శ్యామసుందరుఁడామెస్వభావమునుఁ బూర్తిగ నెఱింగిన వాఁడగుటచే నట్టిమాటల నెన్నఁడును నోట వెడలనీఁడు. కొన్ని సంవత్సరముల క్రింద క్రొత్తగా న్యాయవాదిత్వ వృత్తి నవలంబించిన దినములలో నాతని యాదాయము కడు స్వల్పముగ నుండెను; అనుదినవ్యయముల కే శ్రమయగుచుండెడిది. ఆదినములలో నొకనాఁడు, పగలంతయు న్యాయస్థానమునఁ బనిచేసి, యాతఁడు సాయంతనమగు వఱకు నుత్తచేతులతో నింటికి వచ్చెను. ఆనాఁడేదో పండుగైనందునఁ గమల, యుదార హృదయముతో నయిదు రూప్యముల వెచ్చించి పులగము వండి బీద

సొదలకుఁ బెట్టెను. ఇంటికిఁ దానునచ్చువఱకీ యసమయ యౌదార్యముఁగని, కఠినభాషణములతో భార్యననెను. "నేను డబ్బుడబ్బునకుఁ గష్టపడుచుండ, నీవిల్లు గుల్లఁ జేయుము. అంత యౌదార్యముండిన, వివాహము నాఁడే తండ్రితోఁ జెప్పి యొకమహారాజు చెట్టఁబట్టవలసి యుంటివి." ఆమాటలకు మారువల్కక, కమల తలవా ల్చెను. తాఁజేసినపనికై భర్తతుమాపణమైనఁ గోర లేదు. కాని నాఁటినుండి యాఱుమాసముల వఱకు జ్వరముచేతను, హృదయ దౌర్బల్యము చేతను మంచ మెక్కియుండెను. ఈ విధముగ శ్యామసుందరుఁడు ముం దునోరెత్తకుండఁ బాఠము నేర్చుకొనెను.

అదియట్లుండె. మనన్యాయవాది యానాఁడు గూఢమున నాయకునింట భుజించినవార్త రెప్పపాటు కాలమున పట్టణమందెల్లెడ నల్లుకొనెను. మఱునాఁడు, కమలగంగానదికి స్నానమునకై పోయెను. ఆనాఁడు సోమవత్యమావాస్య. పురమునందలి ధనికురాండ్రం దఱు స్నానార్థము ఘట్టమునకు వచ్చిరి. కమల మోము ను జూడఁగనే వారొకరితో నొకరు గుసగుసలాడ నారంభించిరి. గొప్పయిల్లాలుగ నగపడునొకయువిద ప్రక్కన నిలచియుండిన మఱియొక వనితతో "చూచి

నావిమ్మా ఆదొరసాని గారిని? భర్తమాదిగ కూడుఁ దినుచుండ భార్య గంగా స్నానముఁ జేయవచ్చినది.” యనెను. ఆమాటలు శూలములై హృదయమున నాట కమల విషాదముచేఁ దెలివిలేనిదై తత్తఱ పడసాగెను. ఎవరో నిశితఖడ్గాహతి హృదయ ప్రదేశమునఁ బ్రయోగించినట్లు దోఁచెను. స్నానముచేయకయే వెనుకకు మరలి యిలుఁజేరెను. సర్పవిషము ప్రతిరక్తనాళమున నిండెను. అన్నమువండి భర్తకు వడ్డింప నాతఁడుభుజించి న్యాయస్థానమున కేఁగెను. ధనవంతుఁడగు నొక కక్షిదారుఁ (పార్టీ) డానాఁడాతనివలలోఁ జిక్కుపడినందున, సంతోషపారవశ్యమున భార్య మనోవేదన నాతఁడు గ్రహింపనేరఁడయ్యె. సాయంతనమున నింటికి వచ్చి చూచువఱకు, ముఖమునిండ దుప్పటికప్పుకొని పరుండి యుండెను. శ్యామసుందరుఁ డామెస్థితి నవలోకించి, నుదురదుముకొనుచుఁ బల్కెను. “కమలా! నేఁడిట్లు పరుంటి వెందుచేత? శరీరము స్వస్థముగనున్నదిగదా?” కమల లేచి కూర్చుండి ‘శరీరమునకేమి? బాగుగానే యున్నది. ఊరకే పరుంటి’ నని బదులు చెప్పెను. కాని యంతటితో నాతనికిఁ దృప్తికలుగలేదు. మనసు స్వస్థము గనే యున్న పక్షమునఁ బెదవులపైని తాంబూలపు నెఱ్ఱఁ

దనమేది? వెంద్రుకల విరియఁబోసికొని యుండు టెందు చేత? ముఖమున విన్నఁదనమేల? నాకొఱ కిప్పటి యట్లు మాఁచుగడ్డఁ దెప్పింపకుండుటకుఁ గతంబేమి? ఇట్టి భావము లనేకము లాతనిమేదస్సునఁ బఱువిడ సాగెను. ఉడుపులవిడిచి, యల్పాహారము గుడిచి,కొంత సేపు లోకాభి రామాయణమునఁ గడపెను. రెండు మూఁడు వినోదములఁ గూడ వినిపించెను. కాని యామంత్రముచే విషముదిగలేదు. కమల యాతని మాటలకు శిరఃకంపముఁజేయుచుండినను,విషమహత్త్వ మామె మనస్సు నచ్చట నిలువనియ్యలేదు. సాయంతన మయ్యె. శ్యామసుందరుఁడు వేళయైనందున శకటము గొని యెల్లెల్లో వెడలెను. కాని కమల మనోవైకల్య మాతనిహృదయమున మెదలుచునే యుండెను. ఆనాఁడు గూడెమున నౌకరియింట వివాహము. దూరమునుండి వచ్చిన పెండ్లికొడుకు పక్షమువాండ్రు మద్యపానము నకై తొందర పెట్టుచుండిరి. పెండ్లికూతురు పక్షము వాండ్రు దానికొప్పుకొనక నిరాకరించుచుండిరి. మన కథానాయకుని కృషివలన నిట్టి దురాచారము లనేక ములు గూడెములందు రూపుమాసెను. కాని మొదటిపక్షమువాండ్రు దూరమున నివసించు వారగుటచేత

నతని యుపదేశము లంతిదూరము బోయియుండినవి కావు. శ్యామసుందరుఁ డచ్చటికిఁబోయి వారి వివాదమును విని మద్యపాన మక్కఱలేదనియే తీర్మానించెను. ఇట్టి వివాదసంధర్భములలం దాతఁడు రాత్రి ౮, ౧౦, గంటలవఱకుఁ గూడ గూడెమున నుండవలసి వచ్చుచుండెను. కాని నాఁటిదిన మాతని మన మస్వస్థముగ నుండెను. కమలయొక్క విచారాక్రాంతమగు ముఖ మాతని కన్నులయెదుటఁ బొడకట్టుచుండెను. 'నా నోటినుండి యేదేని పరుషవాక్యము వెలువడలేదుకదా? నాకట్టిజ్ఞప్తిలేదు. అట్లయిన నీవిచారమునకుఁ గారణమేమైయుండును? అకారణముగ నామె మనస్సిట్టిస్థితికిఁ బాల్పడుట సంభవింపదు.' ఇట్టియాందోళన మాతనిఁ దొందరపెట్టి వెంటనే యింటికి మరల్చెను.

తృతీయ రంగము

శ్యామసుందరుఁడు భోజనముచేసి శయ్యపైఁ బవళించెను. కమల కీపూఁటఁగూడ నన్నము రుచిగనుండ లేదు. ముఖ మిప్పటికిని చిన్నబోయియుండెను. కొంచెము సేపాలోచించి యతఁడనెను. "కమలా! నీవెందుకిట్లున్నావు?"

కమ:—నా కేవిచారము లేదు.

శ్యామ:—నీశరీర మెట్లున్నది?

కమ:—శరీరమున కేమైనది? చూచుచున్నారుగదా! బాగుగఁ గూర్చుండియే యున్నాను.

శ్యామ:—అట్లనిన నేనొప్పుకొనను. నీవిట్లు విచారగ్రస్తురాలవై కూర్చుండియుండుట కేదేనికారణముండి తీరవలెను. ఈ విషయముననిన్నడుగు నధికారము నాకు లేదా?

కమల:—మీరు నాప్రాణేశ్వరులు; మీకుఁ గాకపోయినచో నీయధికార మింకెవరికుండును?

శ్యామ:—అట్లయినచో నీదాపరిక మేల? నేను నామనోగతము నెన్నఁడైన దాచియుంటినా?

కమల:—(క్రిందుగఁ జూచుచు) నేను మాత్రము దాచుచున్నానా?

శ్యామ:—ఇదివరకెట్లుచేయలేదు కాని నేఁడు మాత్రము దాచుచుండుట నిక్కము. కన్నెత్తి నా ముఖము వంకఁ జూడుము. స్త్రీలొక్క చూపున పురుషుల ప్రేమను బరీక్షింపగలరని చెప్పుదురు; కాని నీవింకను నా ప్రేమయొక్క లోతుఁ గని పెట్టినట్లగపడదు. నీ యీ యుదాసీనత నన్నుం

తయు నస్వస్థతపాలు చేసెనని దృఢముగ నమ్మెము. ఇఁక నీవిచారకారణముఁ దెల్పకుండిన నా యందు నీకు నమ్మకము లేదని తలంచెదను!

కమ:--(కన్నీటితో భర్తవంకఁజూచి) నాహృదయ శల్యము నూడఁబెఱికి వైచెదరా?

శ్యామసుందరుఁడు ఱిచ్చవడి కొంచెము సేపైన తరువాత భయకంపితమగు స్వరముతో నిట్లనెను. “కమలా! నీయీప్రశ్న నన్ను మిగుల బాధించుచున్నది. నేనును, నాసర్వమును నీయధీనము. నావిషయమున నీవట్లు తలంపఁ గూడదు.”

ఒకమాట యనఁబోయిన, వేఱొకమాట నోట వెడలెనని తెలిసికొని, కమలయనెను. “నేను మీప్రేమనుగూర్చి యొకనాఁడేనియు శంకించియుండలేదను సంగతి భగవంతుఁడెఱుంగును. నావిచారకారణమును వినినచో, నన్నెగతాళిచేయుదురేమోయని నేనట్లంటిని కాని వేఱుకాదు. నేఁజెప్పఁబోవుమాట లనఁదగనివని యెఱుఁగుదును. అందువలన నేయింతవఱకు వానిఁ దాఁచితిని. నామనస్తాపకారణ మొకమాటయేకనుక దాని రెండు మూఁడు మాసములలో మఱచియుందును; కాని

మీరిప్పుడు పల్కినవాక్యములు నామనోగతమును బయటఁబెట్ట నన్ను నిర్బంధించుచున్నవి. నాకు మీ మీఁద నమ్మకము లేదని మీరు తలంచిననాఁడు నాగతి యేమగునో విచారించితిరా? తమ యీవాక్యమే నన్ను తొందర పెట్టుచున్నది."

శ్యామ:---అవును. నీమనసులోనిమాట నిర్భయముగఁ జెప్పుము.

కమల:-మీరిఁకముందు నిమ్న జాతులవారితోఁ గలయుట, వారితో భుజించుట, మానుకొనవలయును.

నిర్దోషియగు వాఁడు న్యాయాధిపతినోట శిక్షా నిర్ణయమును వినినతోడనే నిట్టూర్పువిడచునట్లు శ్యామ సుందరుఁ డామాటల వినినతోడనే దీర్ఘనిశ్వాసము వదలి కొంచెము సేపూరకపరుండి తరువాత లేచి యనెను. "మంచిది; నీయిష్టప్రకారము చేసెదను. అట్లు చేయుటవలన నాకు మనస్తాపముకలుగుట నిశ్చయము. అయిననుమానె. కాని యొక్కమాట చెప్పుము. ఇది నీకు స్వయముగదోఁచిన బుద్ధియా లేక యెవరిదేని యుపదేశమా?"

కమ:-తోడిస్త్రీలు నన్ను వెక్కిరించుచుందురు. నేను వారి వాక్శూలములపోటుల భరింపఁజాలను. వారి

నోళ్ళఁ గట్టివేయు నధికారము నాకులేదు. మీ
మీఁద నాకధికారముకలదు. కావున మిమ్ము
నిర్బంధించుచున్నాను.

శ్యామ:-సరి. మంచిమాట నీవుకోరినట్లు జరుగును.

కమల:-మఱియొక మనవి. నేను నామనసును విచ్చి మీ
యెదుటఁ బెట్టితిని. పురుషులిట్టి యెగతాళిమాట
లను లక్ష్యముచేయరు. స్త్రీలమగు మేము బల
హీనలము. మామనస్సులు దుర్బలములు. పరు
షవాక్యములు మామృదు హృదయములందు
లోతుగ గ్రుచ్చుకొనును. మీరావిషయమున
విచారపడవలదు. నన్నిట్టి పరుషభాషణముల
నుండి తప్పించుటకై మీమనస్సునకు బాధకలు
గుట నాకిష్టములేదు. నేనును నిట్టిమాటలకుఁ
జింతనొందకుండు నలవాటు చేసికొనెదను. అది
చేతఁగానిచో, తోడి స్త్రీలతోఁ గలయుటయే
మానుకొనెదను.

శ్యామసుందరుఁడు భార్యను కౌఁగిలించుకొని
యెను "కమలా! నాకాలమున నీవిట్టి పోటుమాటలఁ
బడుట నాకిష్టములేదు. నీమెత్తని హృదయమున
నొప్పిఁగలుగ నియ్యను. విచారము మానుము. ఏదీ
యొకపాట !"

కమల సంతసించెను. ఆమె మోము వికసించెను. హార్మోనియముదీసి మందమును మధురమును నగు స్వరమునఁ బాడ నారంభించెను.

చతుర్థ రంగము

శ్యామసుందరుఁడు పల్లెలకుఁబోక వారము దినములు గడచెను. నిమ్నజులగు సోదరులతో భ్రాతృభావమును స్థాపించుట వారికి పశుత్వముండి మానవత్వమును వివక్షించు యోగ్యతఁగల్గించుట. వారి నజ్ఞానగుహనుండి వెలుతురునకుఁ దీసికొనివచ్చుట యనునవి మన శ్యామసుందరుని జీవితోద్దేశములు. ఇట్టి సత్కార్యమార్గమున కడ్డముగ గోడ పెట్టఁబడినప్పు డాతనికి సంతాపమొదవుటయం దాశ్చర్యమేమికలదు? తన కర్తవ్యములఁ దాను యథావిధిగ నివర్తించుచున్నానని తెలిసియుండువఱకే కదా మానవుండగువానికి నిజమగు నానందము లభియించుట. సంఘము నెడఁ దమకర్తవ్యము లేవియో యెఱుంగని మహానుభావులుగూడఁ బ్రపంచమునఁ గలరు. కాని యట్టివారిని మానవనామమున వ్యవహరించుటయే పొరపాటు. దుర్వర్తనము లలవడిన మనుష్యులు తాము నడచుమార్గము తప్పని తెలిసియుఁ

దన్మార్గమునుండి తమను కాపాడుకొనఁజాల కున్నారు. జూదరి కెంత బోధించినను, నతని కెంత భయపెట్టినను, జూదమాడుట మానుకొనఁడు. మద్యపాన పరాయణుని జెయిలో నుంచినను, వదలినతోడనే మద్యవిక్రయగృహమునకుఁ దారిదీయును. ఇది దుర్వ్యసనముల మైకము. సత్కార్యాచరణపు మైకముసైత మింతకన్న నెక్కువ బాధించు స్వభావము గలది. పగలంతయు శ్యామసుందరుఁడు వ్యవహారకార్యము లందు మున్గియుండును. కాని సాయంత్రపువేళ రాఁగానే యతనిమనస్సెంతయుఁ బరితాపపడుచు, సాంఘిక కర్తవ్యమును వ్యక్తికొఱకు బలియిచ్చుట కమానుషయత్నముఁ జేయవలసి వచ్చుచుండెను. గృహారామమున నొంటరిగఁ గూర్చుండి, యంతరంగమున నీవిషయమునె తర్కించుకొన నపుడాతఁడు పలుమాఱు తనమనోదౌర్బల్యమును నిందించుకొనును. 'మహేకార్యమైన నొనర్చెదగాని యీ పని మాత్రము చేయనని ఖండితముగ కమలతోఁ జెప్పెదునా'యని పలుమారు లాతఁడు తలంచుకొనెను. కాని, యక్కటా! ఈమాటలామె మనస్సు నెట్టి వ్యసనముపాలు సేయునో! నాపైఁగల ప్రేమయందు నిమగ్నమైయున్న యాకమల కీవచనము లెంత బాధాకరములుగ

నుండునో! ప్రాణముకన్నఁ బ్రియతరమగు నో కమలా! నీవంటి యమూల్యరత్నమును గలిగియుండియు నేను నన్ను దురదృష్టవంతునిగ భావించుకొంటినేని, యది నా బుద్ధిమాంద్యమే యగును! నేఁడు నేనింతటి మన స్తాపమున కధీనుఁడ నైతినని నీవెఱింగి యుండినచో, ముం దెంతటివాక్కాఠిన్యమునకును దప్పకఁ దలయొగ్గు దు వనుటయందు సంశయముండునా! ప్రపంచ మంత యు నేకగ్రీవముగ నిన్ను నిందించినను దోసిలి యొగ్గు దువు! ఇంతటి ప్రేమకు మారుగ నీకిచ్చుటకు నాయొద్ద నేమికలదు? మానవునకు జాతీయధర్మము సర్వధర్మ ములలో నుత్కృష్టతమమైనదేకాని, యొక్కొక్కప్పు డసామాన్య స్థితులందు సంఘమును వ్యక్తికొఱకు వదలవలసివచ్చును. అయోధ్యానగరమున వసించి, తన ప్రజలకు సుఖము లభింపఁజేయుట శ్రీరామచంద్రుని సాంఘిక కర్తవ్యమై యుండియు, అతఁడు పితృవాక్య పాలనముకొఱకు దానిఁద్రృణీకరించెను! అయోధ్యవాసు లెవ్వాని దమ భాగ్యదేవతగ భావించుచుండిరో యట్టి శ్రీరామునిఁబట్టాభిషిక్తునిఁ జేయుట దశరథునికి సాంఘిక ధర్మమై యుండియు, నతఁ డద్దాని వ్యక్తివిషయకమగు స్త్రీయధర్మమునకై విడిచిపెట్టెను!

అయ్యునను, కమల, భర్తమానసికస్థితిఁ దెలియక యుండెననుట పొరపాటు. ఏరాత్రి యా దంపతులకుఁ బూర్వోక్త సంభాషణము జరిగియుండెనో యానాఁటి నుండియు 'నా ప్రాణేశుని మనస్సు నెంత నొప్పించితి' నను పరితాప మామె యంతరంగమునఁ బొడమని నిమిషమే లేదు. ఆమె కతని ముఖమున సహజకాంతి యొకింతయుఁ గన్పట్టలేదు; ఆహార నిద్రాదులయం దాతని కొంటి యాసక్తి ప్రకటనమగుచుండలేదు. మాటలాడుచుండినఁ బరధ్యానముగ మాటలాడును. అతఁడాడు ప్రతిపదమును దన మానసికస్థితిని దాచుట కొఱ కాతఁడు చేయుచుండిన ప్రయత్నమును వ్యక్తపఱచుచుండెను. నవ్విన తెచ్చి కోలు హాసముగ నుండెను. కమలకీ లక్షణము లన్నియు నద్దములోవలె స్పష్టముగ నగపడుచుండె. 'నేనెంతటి స్వార్థపరాయణురాలను! ఎట్టి హీనాత్మను! తుచ్ఛురాలును, మర్యాదహీనయు, నగు నొకస్త్రీ చేసిన వేళాకోళమునకుఁ గినిసి, నాభర్త కెంతటి దారుణ సంతాపముఁ గల్గించితిని! నాకొఱకాయన తన యంతర్మాత నింత గట్టిగ నణచి పెట్టినుకాని నేనొక సామాన్యమగు పరుషవాక్యపు మనస్తాపమును సహింపలేక పోయితిని!' ఇట్లు చింతించి

చింతించి యీ యువతి పలుమాఱు తనభర్తనా నిర్బంధ వాగ్దత్తమునుండి విడుదల చేయఁదలంచును; కాని శ్యామ సుందరుఁ డామెకట్టి యవకాశము నొసంగఁడయ్యె.

పంచమ రంగము

ఒకవారమువఱ కంత్యజసోదరులు శ్యామసుంద రునికై యెదురుచూచిరి. 'శరీర మస్వస్థముగ నైన నుండును; లేదా యేదైన వ్యవహారము విశ్రాంతి నియ్యకుండవలయును. ఈరెండును గాదేని గ్రామాంతర మేగియుండు'నని వారు తమ మనసుల సమాధాన పఱచుకొనుచుండిరి. వారము గడచిన తరువాతఁగూడ నాతనిరాక గానరానందున, వీపున దుప్పటులును, దలలఁ దెల్లనిపాగాలును, ధరించి కాళులకు మోటు పాపోసులఁ దొడిగికొని, భుజములపైనఁ గఱ్ఱలనిడి, గుంపుగ వెడలి వారు శ్యామసుందరునింటికి క్షేమ మారయవచ్చిరి. కర్తవ్యమును మానుకొనినందు కేదేనికల్పితకారణముఁ జూపక తప్పదయ్యె. ఇంటిలో శరీర మస్వస్థముగ నున్నదని యాతఁడుబొంకెను. ఈమాట విన్నప్పటినుండి యాతని యింటికివచ్చుచుఁ బోవు చుండు నంత్యజ సోదరులకు విరామము లేకపోయె. ఒక

గ్రామమువాండ్రు వచ్చిపోయిన తోడనే మఱియొక గ్రామమువాండ్రు వచ్చుచుండిరి. మన న్యాయవాదియు మొదటివారితో బొంకిన బొంకులనే మరల మరల బొంక వలసివచ్చెను.

రెండవవారము గడచినను శ్యామసుందరు నింట శరీరమింకను నస్వస్థముగనే యుండెను. ఒకనాఁటి సాయంత్రమున నతఁడు వాకిటనిలచియుండ, గూడెపు నాయకు లనేకులు సూర్యనారాయణ శాస్త్రిలుగారిని దీసికొనివచ్చి నిలచిరి. ఈవైద్యుఁ డభినవ ధన్వంతరి యని ప్రసిద్ధినొందియుండెను. మంత్రోచ్చాటనమైన తోడనే పిశాచములు పఱువిడునట్లు శాస్త్రిలుగారి దర్శనమైనతోడనే యెంతటిప్రాతరోగమైనను పలాయనము చెప్పును. మఱియుఁ, బలుమారు వ్యాధితోఁ బాటు రోగికూడఁ బోవుటగలదు. శ్యామసుందరుఁ డీవైద్యునిఁజూడగనే తత్తఱపడసాగెను. 'ఇప్పుడేమని బొంకుదును? గుట్టు బట్టబయలగు నవస్థ సంభవించినది. ఈదౌర్భాగ్యుల కీవైకుంఠవైద్యునిఁ దీసికొనిరావలయునను బుద్ధియేల పుట్టవలయును ? ముందువెనుకఁ జూడక మృత్యుదేవతఁ బోలెవచ్చి వాకిటనిలచిన యీవైద్యశిఖామణి నేమనవలయు?' నని విచారింపుచోఁ

గెను. కాని, విచారింప నవకాశమెక్కడిది? ఎవ్వరి నాతఁడు తనప్రాణముకన్న నెక్కుడుగఁ బ్రేమించు చుండెనో యట్టికమలకు నాతరుణమునఁ గొంచెము జ్వరము వచ్చిన నెంత బాగుగానుండునని యతనికిఁ దోఁపసాగెను!

వైద్యుఁడు వచ్చి "అయ్యా! తమభార్య రెండు వారములనుండి జబ్బుపడియుండిన వార్తవిన నాకెంత యుఁ జింతవొడమెను! మున్ముందుగ నాకీసంగతి తెలిసి నచో, వ్యాధియింత దీర్ఘమైయుండదుగదా యని తలఁ చినపుడు నాకుమఱింత విచారముకలుగుచున్నది. ఇం తకు, జబ్బేమిటి?"

శ్యామసుందరుఁడేమియుఁ దోఁచక, నటునిటుఁ జూచి మెడలుసర్దుకొని, తలగోకికొని, దగ్గి, తలవంచి, పల్కెను. "అవును. అవే, స్త్రీలకు సామాన్యముగా వచ్చువ్యాధులు. ఇప్పుడు తమ యనుగ్రహమున నారో గ్యము మరలవచ్చుచున్నది. డాక్టరు దొరసాని యౌషధ మిచ్చుచున్నది. ఇవిపాశ్చాత్య నాగరకత దినములుకదా! ఈకాలమున నింగ్లీషువైద్యమందు జనులకెక్కువ విశ్వా సము; మఱియు నేవైద్యునియందు విశ్వాసముండునో

రోగిశాతనివలననే యారోగ్యము లభించును! ఇదియే తమకు శ్రమయియ్యకుండుటకుఁ గారణము."

శాస్త్రి:—తమరు సెలవిచ్చినమాట నిజము. ఏడాక్టరు దొరసాని యుపచారము నడపుచున్నారు?

శ్యామసుందరుఁడు మరలఁ దలగోకికొని, యటు నిటుఁ జూచి చెప్పెను. "అదే; బోగను దొరసాని యుపచారము." ఈసందర్భమున మనన్యాయవాది తనకుఁ గల వ్యవహారజ్ఞానము నంతయు వినియోగింపవలసి వచ్చెను! నాఁటిదిన మాతఁడే దార్భాగ్యుని మోమువఱు వాతఁ జూచెనోకాని, ప్రతినిమిషమును నాతనికిఁ బ్రతికూలముగనే పరిణమించుచు వచ్చెను. ఇట్లు శాస్త్రిలు గారితో సంభాషించు చుండగనే మఱికొంద అంత్యజనాయకులు బోగను దొరసానిని వెంటఁబెట్టుకొని రానేవచ్చిరి! శ్యామసుందరుని మోము మఱింతవాడిపోయెను. ముఖవికాసము కప్పురమువలె నెగిరిపోయె. 'ఈదయ్యి మిప్పుడే యెందునకు వచ్చెరా దేవుఁడా!' యని దానిని మనసులోఁ దిట్టిపోయుచుండునంతలో నామె యాతని వాకిటనిలచెను. కుర్చీపై నుండిలేచి హస్తస్పర్శ మొనర్చి యామెనోటినుండి ప్రశ్న యేదియు వెలువడక పూర్వమే లోనికిఁగొనిపోయి, యచ్చటఁ

గూర్చుండఁబెట్టి, కమలగదిలోనికేఁగి యామెతో నాలోచించెను. "ఇప్పుడు పరీక్షవచ్చినది. నీశరీర మస్వస్థముగ నున్నదని బొంకితిని. అదివిని యీ తెలివిమాలిన వాండ్రు సూర్యనారాయణశాస్త్రిని బోగనుదొరసానిని దీసికొనివచ్చినారు. దొరసాని చావిడిలోనున్నది. ఇంకఁ గర్తవ్యమేమి?"

కమ:—అట్లయిన నన్నిపుడు జబ్బుపడుమనెదరా?

శ్యామ:—(నవ్వి) నీశత్రువులు జబ్బుపడెదరుగాక!

కమ:—శత్రువుల జబ్బు మనయక్కఱఁ దీర్పఁజాలదు.
దొరసానిని దీసికొనిరండు. నేనుదుప్పటి బిగియఁ
గప్పుకొని పరుండెదను.

శ్యామసుందరుఁడు దొరసానిని దీసికొనివచ్చుటకై యవతలకుఁబోయెను. కమల యాపాదమస్తకమును దుప్పటిఁగప్పుకొని మూల్గుచుండెను. దొరసాని వచ్చి, యుష్ణమాపకము (థర్మామీటరు) నోట నునిచి చూచి, నాలుకఁబరీక్షించి, ముఖలక్షణముల మార్చి యనెను. "వ్యాధి హెచ్చినది. మూర్ఛవలెనున్నది. బయటికి జ్వరములేదు; కాని యది హృదయస్థమై యున్నది. తలనొప్పిగ నున్నది కాదూ?"

కమ:—తలపగిలిపోవుచున్నది.

భోగ:—ఆకలిలేదుగదా.

కమ:—మెతుకుఁజూచిన నసహ్యాము.

అంతఁ దొరసాని యౌషధపత్రము వ్రాసి యిచ్చి వెడలిపోయెను. తనకట్టమునంతకు మునుపే చేతవేసికొని యుండిన శాస్త్రులుగారికనక్కడనుండుట వ్యర్థముగఁ దలంచెను. శ్యామసుందరుఁడు వాకిటనిలచి యున్న తనయుపకర్తల కడకుఁబోయి యనెను. "మీరం దఱు చాలశ్రమ చేసితిరి; నాభార్యశరీరము కుదురు చున్నది. మీకందఱకుఁ గృతజ్ఞతా వందనములు."!

వారందఱు వెడలిపోయిన తరువాత శ్యామ సుందరుఁడు లోనికేఁగి, నాఁడు జరిగిన చర్యనంతయుఁ దలంచి నవ్వసాగెను. పిమ్మట నిటువిచారింపఁదొడఁగె. 'చేయఁదగని కార్యము లేవికలవో, యవియన్నియు నేఁడు చేయవలసి వచ్చెను. ఇఁకనైన దేవి ప్రసన్న మగునా ?'

షష్టమ రంగము

శ్యామసుందరుఁడు భోజనానంతరము శయ్యపైఁబరుండి నిద్రపోయెను. కాని కమలకు నిదురరా లేదు. ఆమెశయ్యపై నూరక పొరలుచుండెను. ఒక

మాఱు లేచి గదిలోఁ బచారు చేయును. వేఱొకమాఱు పుస్తకమును విచ్చి దీపము నెదుటఁ గూర్చుండును; కాని యేపనిఁ జేయుటకును దోఁచ లేదు. గాలిచేగదలు కొమ్మలుగల చెట్టుక్రిందఁ జంద్రకిరణములు నృత్యము చేయున ట్లామె తలంపులు స్వస్థతనెఱుంగక నటు నిటుఁ బఱువిడుచుండెను.

"నేనతని నెంత బాధించితిని! అక్కటా! నేఁడా యన కెంతసంతాపము గలిగియుండును! జీవితమున నెన్నఁడును ననృతమాడియుండని నాప్రియభర్తనేఁడు నాకొఱకనృతవాదికావలసి వచ్చెను! ఆయనయొకవేళ యబద్ధమాడ సిద్ధపడియే యుండినచో, నేఁడొక రాజ్యమును సంపాదించియుండును! ఇట్టిసత్యవ్రతుని నేదుర్గతిపాలొనరించితిని! ఇట్టికార్యము కొఱకొనా నేనతని సమభాగినిగఁ దలఁపఁబడుట! ఆయనయెడ సహానుభూతిఁ గల్గియుండుట; సత్కార్యము లందాతనికిఁ దోడ్పడుట; సదుపదేశ మొనర్చుట; ఆపదలందు ధైర్యమిచ్చుట; ఇవి కదా నేను చేయవలసిన పనులు. వీనికిమాఱుగ నేనా సత్పురుషుని ననృతవాదిత్వపు నలలోనికి లాగుచున్నాను. ఈశ్వరా! నాతప్పు మన్నింపుము! అతఁడు వ్రాసిన యాపత్కార్యమున సాయ మొనర్చుట నాకు

విధియైయుండెను. పాప మీగూడెపు వాండ్రెంత నిష్కపట స్వభావులు; ఎంత యుదారమానసులు! ఇట్టి వారి యభివృద్ధికై పాటుపడకుండఁగదా నాభర్త నాపితిని! తెలివిమాలిన యొక స్త్రీమాటలకు నొచ్చుకొనిగదా నేనింతటి యకార్యమొనర్చితిని! అంతటితో సంతసింపక యతని నబద్ధమాడుటకుఁ గూడ బలవంతపెట్టుచున్నాను! నా యీదుష్కృత్యములఁ జూచియు, మూర్తీభవించిన గుణరాశియగు నానాథుని మన స్సెప్పటివలె నున్నది! ఆయన, నన్నజ్ఞానురాలిగఁ దలంచి నా యీదౌర్బల్యముల నన్నిటిని దన ప్రేమాంబరమునఁ గప్పిపెట్టుచున్నాఁడు! నేనట్టి సంకుచిత హృదయను. నేనాతనిపాదములఁ గడుగుటకైన యోగ్యురాలను గాను. దొరసానిని బంపివచ్చినప్పు డాతనిముఖము నలంకరించిన హాసమెంత పవిత్రమైనది! అది కేవలమునన్ను సంతోషింపఁ జేయుటకై జన్మించినదే! నాథా! నేనాపాదమస్తకమును బాపములతో నిండియున్నదానను! నేను పతితను! నాకు నీప్రేమాంబుధియందుఁ దావిమ్ము!”

ఇట్లు తలపోయుచు నామె తటాలున శ్యామసుందరుని ముఖమువంకఁ దిరిగిచూచెను. సంతోషప్రదమగు నిద్దుర యాతని ముఖకమలమును వికసింపఁ

చేసియుండె. పెదవులపైనఁ జిఱునగవు ప్రకాశించు చుండెను. అతనిమోము దమ్మిఁ జూచినతోడనే కమల హృదయమునఁ బ్రేమతరంగ మొకటి యుద్భవిల్లెను. సముద్రమువలెనే మానవహృదయము సైత ముప్పొంగు చుండును. స్వచ్ఛమగు నాప్రేమచేఁ బరవశయై, యామె భర్తవక్షము నలముకొనెను. నిద్రితుఁడగు యజమానుని సంపదల యథేచ్ఛముగ జూఱఁగొను దొంగవలె, సుషుప్తియందున్న భర్తయొక్క ప్రేమఁపు నిధిని కమల నిర్భయముగఁ గొల్లగొనుచుండెను. యజమానుఁడు మేల్కొనునేమో యను శంకచోరుని మనమును బాధించునట్లే, భర్త మేల్కాంచి యుండఁడు గదాయను సందియ మామెను వేధించుచుండెను. స్త్రీలయనురాగము నిరంకుశ స్వాతంత్ర్యము ననుభ వింపదు. లజ్జయు, మౌగ్ధ్యమును, స్త్రీల కన్నులఁ బైకెత్తనీయవు. తమ యుత్సాహమును, మోహమును, కృత్రిమములుగఁ దలంపఁబడునేమో యను భయము వారిపాదములకు శృంఖలములై యుండును!

సముద్ర ముప్పొంగినపుడు పగిలిపోయిన నౌకా శకలములును, నత్తగుల్లలును, పనికిమాలిన యితర పదార్థములును, తీరమునవచ్చి పడునట్లు కమలహృద

యమున నుద్భవిల్లిన ప్రేమసాగర తరంగమంతకు మున్నామె యంతరంగమున మెదలుచుండు శల్యములఁ బైకినెట్టివైచెను!

మఱునాఁడు శ్యామసుందరుఁడు న్యాయస్థానము నుండి యింటికివచ్చి కమలతో ననెను "నేను గ్రామాంతరమునకుఁ బోవలసియున్నది; రెండుమూఁడు దినములలో వచ్చెదను. నాకు సెలవా?"

కమ:— ఏగ్రామము పోయెదరు?

శ్యామ:— వ్యవహారమొకటి వచ్చినది; భాగల్పురమునకు.

కమ:— ఇప్పుడే వెడలవలయునా?

శ్యామ:— రేపే యచట నుండవలసిన దినము.

సాయంత్ర మూఁడుగంటలవేళ శ్యామసుందరుఁడు భాగల్పురమునకై వెడలెను. మూఁడుదినములలో వత్తునని చెప్పిన దానికిఁ బదులుగ నాల్గుదినములచటనే గడచెను. అయిదవనాఁడు సాయంత్రము మూఁడుగంటలగువఱకుఁ బాటలీపుత్రమువచ్చి, యింటికిఁ బోవుచుండ, వీధిలో గూడెపునాయకుఁ డొకఁ డగపడ, "ఏమయ్యా! ఎటుఁబోవుచున్నా"వని శ్యామసుందరుఁ డాతనిఁ బ్రశ్నించెను.

నాయకుఁడు డులికిపాటుతోఁ దలయెత్తి చూచి పల్కెను. "నిన్ననే వచ్చెదరనుకొంటిమి; ఆలస్యమైన దేమి?"

శ్యామ:— నిన్న రా వలనుగలుగ లేదు; అందఱు క్షేమమా?

నాయ:— తమ దయచేత నందఱును బాగుగనున్నారు. నేఁడు తమయింట గొప్ప సమావేశమైనది.

శ్యామ:— మా యింటనా? ఏమిటిసమావేశము?

నాయ:— దొరసానిగారు సభ చేసినారు; మా యాఁడువాండ్రందఱును వచ్చియున్నారు.

శ్యామసుందరుఁడు ముందు సాగిచూచువఱకుఁ బరిచితములగు ముఖము లనేకము లగపడెను. వారు చేయు ప్రణామముల కుత్తరమిచ్చుచు ద్వారముకడకుఁ బోవ జనులచట గుమిగూడియుండిరి. వారందఱును దమ స్త్రీలవెంటఁ గొనివచ్చియుండినవారు. శ్యామసుందరుఁడు చావిడిలోనికిఁబోయి వస్త్రములవిడచి తన రాక భార్య కెఱిగింపవలదని నౌకరుల కాజ్ఞాపించి తాను కిటికీలో నుండి లోపల జరుగు చర్యలఁ గనిపెట్టుచుండెను.

పందిరిలోఁ దెల్లనివస్త్రము పరువఁబడి దాని మీఁద మూఁడు నాలుగు వందల యాఁడువాండ్రు మోటునగలతోను, మోటు వేషములతోను, గూర్చుండి యుండిరి. కొందఱు నవ్వుచుండిరి; మఱి కొందఱు మాట్లాడుచుండిరి. కమల, కేలఁ బళ్లెరముఁ బూని వారలకందఱకుఁ దాంబూలమిచ్చుచుండెను. చిన్నపిల్లలకు మిఠాయియు, నాటబొమ్మలను, నిచ్చుచుండెను. తాంబూలము లైనతరువాత సంగీత మారంభమయ్యెను. నేఁడు కమలసైతము మోటుచీరఁ గట్టియుండెను. ఒక నగయైన నామె శరీరమున నగపడలేదు. యంత్ర సహాయమున నామె పాడి వారి కానందముఁ గల్గించుచుండెను.

ఈచర్య నంతయుఁ గనిపెట్టుచుండిన శ్యామసుందరుని యానందము వర్ణనాతీతముగనుండెను. సంగీతమైనపిమ్మట కమల పదునైదు నిమిషముల వఱకు గ్రామ్యభాషయం దాస్త్రీల కుపదేశ మొనర్చి సభఁ జాలించెను. తరువాత నామె వారినందఱను మర్యాదతో వీడుకొల్పెను. శ్యామసుందరుని యుత్సాహమాగదయ్యె. చావిడిలోనుండి యొకదుముకున లోనికి వచ్చి కమలను గనుసన్నచే గదిలోనికిఁ బిలిచి కౌఁగి

లించెను. అంతకుమునుపు చూచినదృశ్యము భార్యను మరల మరలఁ గాఁగిలింప నతనిఁ బురికొల్పెను. కమల సిగ్గుతోఁ బల్కెను. "ఉన్నప్రేమనంతయు నేఁడే వెచ్చించెదరా యేమి?"

శ్యామ:— నా యానందము నేఁడు మేరగానకున్నది;
నీవు నిజముగ దేవివలె నా కగపడుచున్నావు.

ఆ నాఁ డాక రాజ్యము లభించినను శ్యామ సుందరుఁ డంత సంతసించియుండఁడు. అంత నతఁడు పది మందిలోనికివచ్చి గుమిగూడియుండిన స్త్రీల కభిముఖుఁడై యిట్లనెను. "సోదరీరత్నములారా! ఆనాఁడు నే నన్నట్లు కమల నిజముగ జబ్బుపడి యుండలేదు; మీతోఁ గలసిమెలఁగ వలదని యామె నన్ను నిర్బంధించి యుండెను. కాని నేఁడామెయే మిమ్మందఱ నాహ్వానించి మీతో సోదరీభావమును వహించెను. నాకిప్పుడు కలిగిన యానందమునకు సూచనగా గ్రామమునకు వేయిరూప్యములచొప్పున నిచ్చి పదిగ్రామము లందుఁ బది వ్యవసాయ నిధుల నేర్పఱచెదను. అచ్చట మీకు వడ్డిలేక యప్పుదొరకును. సాహుకారుల కపరిమితముగ వడ్డియిచ్చి యిల్లు గుల్లచేసికొనుచున్న మీ

బాధలు నివర్తియగును. ఎవ్వరు నేఁడు మిమ్మాహ్వానించిరో వారే యానిధుల కధ్యక్షులుగ నుందురు."

స్త్రీలందఱు చేతులెత్తి యా దంపతులకు మ్రొక్కిరి. అంత కమల భర్తతో ననెను. "బాగుగ నున్నది; ఈబాధల నన్నిటిని నాతలపైఁ బడవైచితిరి!"

శ్యామ:— (మందహాసముతో) నీటిలో నడుగుపెట్టిన తరువాత నీవే యీదనేర్చుకొనఁ గలవు.

కమ:— నాకీలెక్కలు, ఏమి తెలియును?

శ్యామ:— వానియంతట నవియే తెలియఁ గలవు. రెండువారముల క్రిందనేకదా నీవు నన్నంత్యజులతోఁ గలయుట, మెలఁగుట, మానుకొన బలవంతపెట్టితివి; అట్టిదానవు నేఁడు వారల సోదరులుగఁ దలంచుచుంటివి. నాఁడు నీపంతము చెల్లెను; నేఁడు నాపంతము సాగెను!

ఆత్మార్పణము

ప్రథమ రంగము

ఉ॥..పాం

బాలురనెల్ల తీవ్రశరజాలములం బొలియించికాని భూ

పాలక పుచ్చకత్తశము................(భారతము. శల్యపర్వము.)

పదమూఁడవ శతాబ్దారంభమున నంతరించిన చందేలు వంశపుతుదిరాజు పరిమళదేవుఁడు. ఆకాలమున నీవంశము వారికి మహోబాయను చిన్న నగరము రాజధానియై యుండెను. మహోబా రాజ్య మప్పటిదినములలోఁ ప్రాబల్యదశనంది యుండిన ఢిల్లీ రాజ్యముతోను, కనోజురాజ్యముతోను, భుజాస్ఫాలనము వేయుచుండెడిది. పరిమళ దేవుని దర్బారునందు, అలహాఁడు, ఓదలుఁడు, అను నిద్దఱు క్షత్రియవీరు లుండిరి. వీరితండ్రి యశరాజు వీరి బాల్యముననే మరణించెను. తండ్రిలేని యీబాలురపైఁ గనికరము వహించి పరిమళ దేవుఁడు వారిని వారి తల్లిని రాజమందిరమునకు రప్పించి రాణీమల్హాణదేవి కప్పగించెను. రాణియు

నాసోదరులను దాఁగన్న కుమారులవలె నెంతో ప్రేమతోఁ బెంచెను. కొంతకాలమునకు వారు మహావీరులై విఖ్యాతులై ఘనకార్యములవలన మహోబాకీర్తిని జిరస్థాయిగాఁ జేసిరి.

మల్హాణదేవి వారిని బెంచిపెద్దలఁజేసి పెండ్లిండ్లు చేసెను. ఆకారణమున వారు మహోబా రాజ్యమునెడ మిగుల భక్తిఁగలవారై యుండిరి. పరిమళదేవుని కొఱకుఁ బ్రాణముల నర్పించుటకు వారు సర్వదా సిద్ధముగనుండిరి. వీరసోదరుల నిర్వక్రపరాక్రమము, చుట్టుపట్టులనుండు ననేక సంస్థానాధీశులను చందేలుల హితైషులుగ నొనర్చెను. మహోబా రాజ్యము క్రమక్రమముగా విస్తరిల్లసాగెను. యౌవనదశ ప్రాప్తించిన తరువాత నీసోదరులు విశ్రాంతిఁగొని యెఱుఁగరు. సమరాంగణమే వారికి విశ్రమస్థానము! మెత్తని పఱుపుల మీఁద వారికి నిద్రయే వచ్చుచుండలేదు.

ఆకాలమే చిత్రమైనది. ఆదినములలో విశ్రాంతిగాఁ గూర్చుండుట యనినను మరణమనినను నొకటే యర్థము. మాటలలోనే పలుమాఱు ఖడ్గము లెగయుటయు, రక్తము ప్రవహించుటయు, సంభవించుచుండెను. పలుమాఱు వివాహవేదికలే రణరంగము లగుచుండినవి.

ఎవనియింట నేని యాఁడుపిల్ల పుట్టినచోఁ గొప్ప యనర్థము కలుగుచుండెను. వేలకొలఁది సిపాయిలయొక్కయు, బంధువులయొక్కయు, రక్తము హారణమగుచుండెను. మన వీరసోదరు లట్టికాలపు నాదర్శపురుషులు. ఆకాలమునకు సహజములగు నైతిక దౌర్బల్యములును, లోపములును, వారిని దమకు లోఁబఱచుకొనక వదలలేదు; కాని నిజము విచారించి చూచితిమేని యవి యాకాలఁపు దోషములు కాని వారి దోషములు కావు!

ద్వితీయ రంగము

ఈ సోదరుల మేనమామ మహీలుఁ డనువాఁడు చాలఁగపటవర్తనుఁడు. వీరియౌన్నత్యమును,గీర్తియును, నాతని కసూయకారణములయ్యెను. వీరి నీయున్నతస్థానమునుండి యెట్లు క్రిందికిఁబడఁద్రోయవచ్చునా యని యాతఁడు సదా విచారించుచుండెను. ఈసత్కార్యమును సాధించుటకై యాతఁడు తన జీవితమును ధారవ్రాయఁదలఁచియుండె. కనుక నెన్నియో యత్నములు చేసి వేసరి తుదకు నెల్లిట్లో పరిమళ దేవునకు దుర్బోధ చేసి యాతనిఁ దన వలలో వేసికొనెను.

ఒకనాఁడు పరిమళదేవుఁ డొంటరిగాఁ గూర్చుండి యుండువేళ మహీపాలుఁ డచటికి వచ్చెను. రా జాతని ముఖమున విచారలక్షణములను జూచి యడిగెను. "భయ్యా! నీముఖము వాడి యున్నది; క్షేమమే కదా!" మహీపాలుఁడు కన్నీరునించెను. కపటవర్తనగల వానికి తన చిత్తవృత్తులపైన నెట్టి యాధిపత్యముండునో యట్టిది సంపూర్ణ విరాగికిఁగూడ నుండదు. వాని మనస్సు దుఃఖించుచుండ మోము నవ్వుచుండును. హృదయమానంద మయమైయుండఁ గన్నులు నీరు గార్చుచుండును. అంతస్సు, అసూయాగ్ని జ్వాలలో మలమలమాడుచుండ, నాలుక, అమృతపు సోనలఁగురిపించు చుండును!

"రాజోత్తమా! దేవరవారి చల్లని నీడలోనున్న నేను కోరఁదగినవస్తు వేదియును లేదు. కాని ఎవ్వారినితము రధోగతినుండి లేవనెత్తి యున్నత శిఖరమున నిల్పితిరో, ఎవ్వారు తమ కృపచేత సౌఖ్యమున నోలలాడుచు సత్కీర్తినిజూఱఁగొనుచున్నారో, అట్టివారు తమయెడఁ గృతఘ్నులై కుట్రలుచేయుచుండుట నాహృదయమును దహించుచున్నది" యని మహీపాలుఁడు పలికెను.

పరిమళ దేవుఁడు, ఆశ్చర్యముతో నడిగెను. "నా సేవకులలో నిట్టివారుఁగూడ నున్నారా?"

మహీ:—అయ్యా! నేనేమియు ననఁజాలను. దేవర హృదయము కృపాసముద్రము. దానిలోఁ బ్రాణములఁ దీయు మొసలి యొకటి డాఁగియున్నది.

పరి:—ఎవఁడతఁడు?

మహీ:—నేనే.

పరి:—(ఆశ్చర్యచకితుఁడై) నీవా?

మహీ:—అవును, దేవా? ఆమందభాగ్యుఁడను నేనే. నేఁడు నామీఁద మొఱపెట్టుకొనుటకు నేనే వచ్చియున్నాను. నాబంధువులయెడ నేను నెఱవేర్చవలసిన విధిగలదు; కాని అది దేవరవారియెడ నేను నెఱవేర్చవలసిన విధికంటె మహత్తరమైనది కానేరదు. అలహుఁడు నాకు రక్తబంధువు. వానిరక్తమే నారక్తము; వానిమాంసమే నామాంసము. అయినను, తన శరీరమునఁ బొడసూపినదికదా యని రోగమును వైద్యుఁడు కెలఁగింపక తప్పునా? అక్కటా! 'నాబాహుబలమునఁ గదా మహీబారాజ్యము నిలచియున్నది' యను నహంకారము వానిమనసున నాటుకొనియున్నది.

ఎఱ్ఱవారిన కన్నులతో రాజనెను "అలహాలుని నేను నాపుత్రునిగ భావించుచుంటిని గదా."

మహీ:--- కాదు. అంతకన్న నెక్కువగఁ దలఁచుచుంటిరి.

పరి:---తండ్రిలేనివాఁడు కదా, నిస్సహాయుఁడు కదా యని నే నాతని నెత్తికొని ప్రేమించుచుంటిని; జాగీరులిచ్చితిని; సేనాధీశుని జేసితిని; ఆతని వివాహసమయమున నే నిరువదివేల చందేలు శూరులఁ గోల్పోయితిని; వాని తల్లియు మల్హాణ దేవియు పౌరుషనుమాట నెఱుఁగక యనేక వత్సరములు కలసి మెలసి యుండిరి. అట్టివాఁడు నాయుపకారమును మఱచునా ? నేను నీమాట నమ్మఁజాలను.

మహీలునిమోము వెలవెలఁబారెను. కొంత ధైర్యముఁ దెచ్చికొని, యతఁడనెను "అయ్యా ! నానాలుక యెన్నఁడును నబద్ధమాడి యెఱుఁగదు."

పరి:---నాకేమి నమ్మకము?

మహీలుఁడు మెల్లగా నేదో రాజు చెవిలోఁ జెప్పెను.

తృతీయ రంగము

'రాజుగారు పిలచుచున్నా'రని భటుఁడొకఁడు వచ్చి విన్నవించు నపుడు మన వీరసోదరులు విశాల మగు నొక మైదానమందు సేనా విన్యాసమున నిమగ్నులై యుండిరి. రాజుగారి యాజ్ఞవినఁగానే, అల హుఁడు, భటుని వెనువెంట దర్బారునకు వచ్చి పరిమళ దేవునకు సవినయముగ నమస్కరించెను.

పరి:--- నేనొకటి యడిగెదను. ఇచ్చెదవా?

అలహుఁడు నిష్కపటముగా ననెను "చిత్తము, సెలవియ్యవచ్చును."

పరి:---మాట తిరుగవు గదా!

అలహుఁడు, కనుఁగొనల మహీపాలునిజూచి యేదో దుస్తంత్రము జరిగినదని యనుమానించెను. 'కానిచో నితని మొగమున నీచియునవ్వేల? రాజు నావిశ్వాస మును పరీక్షించుచుండవచ్చును' అనుకొని వచించెను. "మహారాజా! ఇంతకు ముందు దేవరవారి నోటనిట్టి ప్రశ్న వినియెఱుఁగను. తమరు నా పోషకులు; నాహి తైషులు; నాప్రభువులు. దేవర కనుసన్నమాత్రమున నగ్నిజ్వాలలోదుమికెదను. మృత్యువుతోఁ బోరాడ

దను!! ఏలికయాజ్ఞ యయ్యోనేని యసంభవమును సంభవముగఁ జేసెదను. నన్నిట్లు ప్రశ్నింపవలదని విన్నవించుకొనుచున్నాను.''

పరి:---సెబాసు! నీవట్లేచేసెదవని నాకాశ గలదు.

అల:---నాకేమి యాజ్ఞ ?

పరి:---'నాహారు'అను పేరుగలగుఱ్ఱము నియొద్దనున్నది కదా!

అల:---'చిత్తము. ఉన్నది.' యని మహీలునిపైనఁ దన నేత్రాగ్ని గురిపించెను.

పరి:---నీకిష్టమైనచో దానిని మాకిమ్ము.

అలహుఁడు మారుపలుక లేక పోయెను. "మాట తిరుగనని, ఇప్పుడేకదా ప్రతిజ్ఞ చేసితిని. ఇయ్యనని యందునా? ఈసమయమున రాజు నాకృతజ్ఞతను బరీక్షింపఁ దలఁచుచున్నాఁడు. నామాటను చెల్లింపకపోయితినా యుపద్రవము వాటిల్లును. ఉపద్రవమువచ్చిన మానె. ఇయ్యనని యెట్లందును? నన్ను విశ్వాసహీనునిగఁ దలంపఁడా? రాజునకు నేను సామాన్యుఁడనగు సేవకుఁడను గానే! నేనాయన ప్రక్కలోను రెక్కలోను బెరిగితిని. నాకాలు సేతులలో బలము లేనికాలమున నాకృత్యముల

నాయన సహించుకొనెను; నన్నుఁ బుత్రునివలెఁ బ్రేమించెను! అట్టి వాని కోరికను జెల్లించకుండఁగలనా?"

భావము లింకొక మార్గమున మఱలెను. "రాజు నాకుఁ జేసిన యుపకార మపరిమిత మనుట నిజమే. నాశరీరములోని యొక్కొక యణువు నాతని యుపకారభారమును వహించి యున్నదను మాటనిజమే. కాని క్షత్రియుఁడు తనగుణము మఱొకనికియ్యఁడు. ఇది క్షత్రియ ధర్మము. నే నతని యన్నముఁ దిని బ్రతికినవాఁడను. ఈశరీర మాతనియన్నదాక్ష్యముచేఁ బెరిగినది. నాశరీరముపైన నాకు సంపూర్ణాధికారము గలదు. దానిని నేను రాజునకర్పింపఁగలను. కాని క్షత్రియ ధర్మము నాచేతిలోనిది కాదు. నేను దాని నతిక్రమింపఁ జాలను. పవిత్రమగు క్షత్రియ ధర్మమును లోహదుర్గముగ భావించిన వీరపుంగవుల మూలముననే కదా దానికీర్తి నేఁటికిని బ్రకాశించుచున్నది. నాపేరునకుఁ జిరస్థాయియగు కలంకము న న్లాపాదించుకొందునా? అక్కటా! మహీపాలుఁడు నన్నెట్టి స్థితిలో నిలిపించినాఁడు! 'వెనుకకుఁ బోయినఁ గోయి, ముందునకుఁ బోయిన నూయి' అనునట్లున్నది. క్షత్రియధర్మమునకుఁ గలంకమునైనఁ దెచ్చిపెట్టవలయును; స్వీయవినాశ

మునకైన నొప్పుకొనవలయును! ఎటులైనను సరే. కృతఘ్నుఁడనైన నగుదుఁ గాక, ధర్మాతిక్రమణము నాకిష్టము లేదు. నా యౌన్నత్య మధోగతి పాలైనను మానె; క్షత్రియ ధర్మమునకు దుష్కీర్తిఁ దేఁజాలను!"

అలహుఁడిట్టి విచారమునఁదలవాల్చి యాలోచించుచుండెను. పాపము, అది యాతనికిఁ బరీక్షా సమయము. ఈ పరీక్షయందలి గెలుపుపైననే యాతని భవిష్యత్తాధారపడి యున్నది! మహీలుని హృదయమానందమున మునిఁగియుండెను.

అంతలో, పరిమళదేవుఁడుబిగ్గరగా ననెను. "ఏమియాలోచించుచున్నావు. ఇచ్చుట కిష్టము లేదా?"

అలహు:— (కన్నుల నేలవాల్చి) "అయ్యా! ఇష్టము లేదు."

పరిమళదేవుఁడు కోపోద్దీపితుఁడై ఖండితముగఁ బల్కెను "ఎందుచేత?"

అలహుఁడు నిబ్బరముతో ననెను "అది క్షత్రియ ధర్మమునకు విరుద్ధము గనుక."

పరిమ:— అలహా! నేను మీకుఁ జేసిన యుపకారమున కిదియే ప్రతిఫలము? ఎఱుఁగుదువు

గదా నీవొకప్పు డెట్టి స్థితియం దుంటివో,
ఇప్పు డెట్టిస్థితియం దున్నావో!

అలహు:— చిత్తము; ఎఱుఁగుదును.

పద్మ:— తెలియును గదా ఎట్లు బాగుచేసితినో యట్లే
నిన్ను చెడఁగొట్టఁగలనని!

అలహుని సహనశక్తి తగ్గెను. కన్నులెఱ్ఱ నయ్యె. కొంచెము కఠినమగు ధ్వనితో ననెను. "రాజేంద్రా! తమరు నాకుఁ జేసిన యుపకారమునకు సదా కృతజ్ఞుఁడనై యుందును. క్షత్రియుఁడగు వాఁడెన్నఁడును నుపకారమును మఱువఁడు. తమరు చేసిన యుపకారమునకు నేను ప్రాణముల కాసింపక ప్రతిఫల మొసర్చితిని. పలుమాఱులు నేను చూపిన ప్రభుభక్తిని, ఆత్మార్పణాసక్తిని, కేవలము జీతము తినినంత మాత్రమున నెవఁడును జూపియుండఁడు. ఇఁక దేవర వారి దర్బారునందు నాకు జీవనము లేదని తోఁచుచున్నది. ఇదియే నాతుది నమస్కారము. తెలివి లేమిచే నేను చేసిన యపరాధములను క్షమింపఁ బ్రార్థించుచున్నాను"

చతుర్థ రంగము

అలహుని తల్లి పేరు దేవలదేవి. భావౌన్నత్యము చేతను, సద్వర్తనముచేతను, భారతవర్షము యొక్క పూర్వచారిత్రమును పవిత్రముగ నొనర్చిన నారీరత్నములలో నామెయొకతె. పరస్పర వైషమ్యమువలనను, స్వార్థపరత్వమువలనను, మన దేశ మంధకారమయమై యుండిన కాలమున సైతము దేశచరిత్రమును కాంతిమంతముగఁ జేయు వనితామణు లిచ్చట జన్మించిరి. అలహుఁడు చూపిన ధర్మపరాయణత్వము వినిన దేవలదేవి కన్నుల నానందాశ్రుపు లూరెను. పుత్రులఁ గౌఁగిలించుకొని యామె పలికెను "నాయనలారా! మీరు క్షత్రియధర్మమును బాలించితిరి. మీయట్టి పుత్రులఁ గని నే నెంతయు ధన్యురాలనైతిని."

ఆనాఁడే వారు మహోబా వదలి వెడలిరి. తమ యశ్వములను దప్ప వారు మఱేవస్తువును వెంటఁ దీసికొనలేదు. తమ సామాను నంతను నచ్చటనే వదలిరి. క్షత్రియుని యైశ్వర్యమును గౌరవమును నతని ఖడ్గమునందే యుండును! ఎవ్వాఁడు శౌర్యధనుఁడో వాని కితర ద్రవ్యములతోఁ బనియేమి?

ఆదివర్ష కాలము. నదినదములు పుక్కిలి పాఱుచుండెను. ఇంద్రుని యౌదార్యముచే భూదేవి యలంకృతమై యుప్పొంగుచుండెను. నెమళ్లు చెట్లపై నెక్కి క్రేంకారములు సేయుచుండె. సేద్యగాండ్రు పొలములలో సృష్టిసౌందర్యదర్శనమున నున్మాదులై పాటలు పాడుచుండిరి. పచ్చని పచ్చికతోఁ గప్పఁబడియున్న పర్వతములతోను, కఱఁగిపోసిన వెండినీటిఁబోలు స్వచ్ఛజలములతో నొప్పుతటాకములతోను, ప్రకృతి సొంపునింపుచుండెను. బయళులందు వీచుచుండిన చల్లనిగాలియు, నడవి పూవులు వెదఁజల్లుచుండిన కమ్మని తావియు, వాయువుచే శిరఃకంపము చేయుచుండిన వృక్షాగ్రములును, మనమునఁ గోరికలను బుట్టించుచుండెను. అట్టి మనోహరమగు కాలమున నాసోదరు లిరువురు మహోబాపురమును వదలి వెడలిరి. వారి కన్నులశ్రువుల రాల్చి రాల్చి డొఱ్ఱఁబడెను. ప్రేమాస్పదమగు జన్మభూమిని వారు వదలవలసినవారైరి. ఏనగర వీథులలో వారు తప్పటడుగు లిడనేర్చుకొని యుండిరో, ఎచ్చటి చెఱువులలో వారు తమ బాల్యమున కాగితపు పడవలను వేసి యాడుకొనియుండిరో, ఎచ్చట వారు యౌవనకాల సౌఖ్యముల ననుభవించి యుండిరో.

అట్టి 'మహోబా'పురమునకు వారు దూరస్థులగుట సంభవించెను. ముందునకుఁ బోవుచుండిరి కాని యడుగులు సాగుటలేదు. పరిమళదేవుఁడు, ఎవరినైన నంపి తమ్ముర మ్మనుచున్నాఁడేమోయని వారు మాటిమాటికి వెనుకవంకకుఁ దిరిగిచూచుచుండిరి. పోనుపోను మహోబా పర్వతము లదృశ్యము లయ్యెను. అంత వారి యాశ నిరాశ యయ్యె. దీర్ఘనిశ్వాసమును విషాదముతో వదలి గుఱ్ఱముల నదలించిరి. వీరుదేశాంతరగతులైన వార్త నలుదెసలవ్యాపించెను. అట్టి వీరపుంగవులకుఁ దావులేని దర్బారుండునా? అన్ని దిశలనుండియు నాహ్వానములురాసాగెను. కనోజురాజు, జయచంద్రుఁడు, వారిని దోడి తెచ్చుటకుఁ దనకుమారునంపెను. వారును రాజకుమారుని సత్కారమునకును, నుత్సాహమునకును, సంతసించి కనోజుపురమునకు వచ్చిరి. వారి రాకకై పరీక్షించుచుండిన జయచంద్రుఁడు, అలహునిఁ దన సేనాధీశునిఁగాఁ జేసికొనెను.

పంచమ రంగము

మన వీరపురుషు లిరువురును వెడలిపోయిన పిమ్మట 'మహోబా' రాజ్యమున దురాగతము లా

రంభ మయ్యెను. పరిమళదేవుని దౌర్బల్యమును గనిపెట్టి మాండలిక రాజులు తిరుగఁబడిరి. వీరి నడఁచిపెట్టు ప్రబలశక్తి రాజ్యమున లేదయ్యెను. ఒకనాఁడు ఢిల్లీశ్వరుఁడగు పృథ్వీరాయని సైన్యములు 'సమతా'యను స్థలమునకుఁబోయి విజయోపేతములై మఱలి వచ్చుచు మార్గమధ్యమున మహోబాయందు దిగెను. మూర్ఖులగు సిపాయిలలోఁ గత్తు లెగురుట కెంతసేపు పట్టును? పరిమళదేవుని యుద్యోగియుల పొరపాటైన నేమి, చౌహాణుల తప్పిదమైన నేమి, మొత్తముమీఁద చందేలులకును, చౌహాణులకును, పోరు తారసిల్లెను. చౌహాణులు స్వల్పసంఖ్యాకు లగుటచే, చందేలులు, ఆతిథ్యధర్మముల నడఁగఁద్రొక్కి, వారినందఱను సంహరించి సంతసించిరే కాని యీ దుష్కృత్యమునఁ దమ కెట్టికీడు మూడనున్నదో తెలియలేకపోయిరి. ఈ దుర్వార్త వినినంతనే పృథ్వీరాయని యాగ్రహమునకు మేరలేక పోయెను. భయంకరమగు పెనుగాలివలె నతఁడు మహోబాపై కెత్తివచ్చి 'మహోబా' రాజ్యములోని ప్రసిద్ధనగరమగు సరసాపురమును నాశనముచేసి రాజధానివైపు మఱలెను. చందేలులుకూడ సమరసన్నాహములు చేసిరికాని యంతకుముందు, చౌహాణులతోఁ జేసిన

యుద్ధమువలన వారలసియుండిరి. అంతకాక, అల హాఁడు, ఓదలుఁడు, లేని సేనలు పెండ్లికొడుకులేని యూరేగింపువలె శోభారహితములై యుండెను. సైనికులు ధైర్యమును వీడసాగిరి. దేశమున హాహాకారములు వెడలెను. మఱియొక నిమిషమున పృథ్వీరాజు మహోబాపైన వచ్చిపడునను భయము జనులను నిర్విణ్ణులుగాఁ జేసెను. పరిమళదేవుఁడు జరిగినదాని కెంతయుఁ బశ్చాత్తాపము నొందెనుకాని దానివలన నేమి ప్రయోజనము? మార్గాంతరముఁ గానక, అతఁడు, 'యుద్ధమున కొకనెల గడువిం' డని పృథ్వీరాయని వేడికొనెను. చౌహాణవీరుఁ డెంతటిశూరుఁడో యంతటి యుద్ధధర్మమును బాటించువాఁడు. దుర్బలుఁడుగాఁగాని, అజాగ్రత్తతోఁగాని, యున్న శత్రువును నతఁ డెదుర్కొనఁ దలంపఁడు. రణధర్మము నతఁ డట్లు పాలించియే యుండనిచో షహాబుద్దీను చేతఁ బడునట్టి దుర్దినము వచ్చియే యుండదు! అతనిధర్మనిరతియే యతని ప్రాణశత్రు వయ్యెను! అదియట్లుండె. పృథ్వీరాయఁడు పరిమళదేవుని సందేశము నంగీకరించి సేనలను మఱలించుకొనెను. 'నేఁటికి బ్రతికితిమిరా దేవుఁడా' యని చందేలులు కొంత సంతసించిరి.

త్లిశ్వరునితో నొల్లు సమరము సేయవచ్చునను విషయమును 'మహాబా' రాజ్యహితైషు లందఱు తల లొకచోఁ జేర్చి విచారింపసాగిరి. నగరముచుట్టును దుర్భేద్యమగు గోడఁ బెట్టింతుమని కొందఱును, మహాబాను నాశనదేవత కప్పగించి దక్కనునకు బోవుదమని మఱికొందఱును, అభిప్రాయ మిచ్చుచుండిరి. సంధిచేసి కొనుట తప్ప నుపాయాంతరము పరిమళదేవునకుఁ గానరాదయ్యె. అప్పుడు మల్హాణదేవి లేచినిలచి యిట్లనెను:-

"చందేలువంశజులగు క్షత్రియులారా! బాలురవలె నర్థములేని మాటలేల యాడెదరు? గోడలు మనను శత్రువులబారినుండి తప్పింపఁగల్గునా? వృక్షము లెన్నఁడైనను గాలి నాపఁగలవా? మహాబాను విడచిపోవుద మనుమాట, ఆఁడువాండ్రనఁదగినది కాని మీరు చెప్పవలసినదా? మీశౌర్యము, మీయాత్మార్పణము, నేఁడెచటికిఁ బోయినవి? మొన్న మొన్నటివఱకుఁ గదా చందేలులపేరు శత్రువులగుండియల నవియఁజేయుచుండెడిది! కడచిన కొన్ని సంవత్సరములలో మీరు వందలకొలఁది యుద్ధములందు గెలుపొందితిరి! పరాజయ మనునది మిమ్మెన్నఁడైన వచ్చితాకెనా? మీ ఖడ్గముల మెఱుపు లెన్నఁడేని మందగిల్లెనా? అట్టి మన

కార్యములు చేసిచూపినవారు మీరే. కాని మీయం దప్పటి పౌరుషము పోయినది. ఆపౌరుష మా సోదరద్వయముతోఁ గూడ 'మహోబా'ను వదలి పోయినది! దేవలదేవి తోఁబాటు జయలక్ష్మికూడ మనలను త్యజించినది! వేయేల? మన యీ దుస్థితిని బోఁగొట్టఁగలవాఁ డొకఁడే కలఁడు! ఆతఁ డెవఁడు? అలహుఁడే! ఆసోదరులే యీ సందిగ్ధావస్థయందు మనలఁ గాపాడఁగలరు. వారినే సమాధాన పఱచుకొనుఁడు! వారినే బ్రతిమాలుకొనుఁడు! మహోబా వారికి చేసిన యుపకారము లెన్నియో కలవు. మహోబా యోషధులును, మహోబా జలమును వారిని పోషించినవి! మహోబా యెడఁ దమకుఁగల విధులను వా రెన్నఁటికిని మఱువరు! రాఁబోవుయుద్ధమున విజయలక్ష్మిని చేకొనుటకు వలయు సామర్థ్యమును, విద్యను, ఈశ్వరుఁడు వారికే ప్రసాదించి యున్నాఁడు!"

మల్హాణదేవి వచనములు జనుల మనములలో నాటుకొనెను.

షష్టమ రంగము

మన కథానాయకులను బిలుచుకొని వచ్చుటకై జగన్నాథభాటుఁడు కనోజు ప్రవేశించువఱకు వారు వేఁటకుఁబోవుచుండిరి. భాటుఁడెదురై రాఁగానే వా రాతనికి నమస్కరించిరి. అతని ముఖమున నవమానమును, సిగ్గును, చిత్రితములై యుండెను. అలహుఁడు తత్తఱముతో నతని నడిగెను "కవిశేఖరా! దారి తప్పి వచ్చినట్లున్నది! మహోబాయందు నందఱు క్షేమముగా నున్నారా? మేమెట్లు జ్ఞప్తికి వచ్చితిమి?" కన్నిటితో భాటుఁ డిట్లనియె. "శూరపుంగవులారా! క్షేమముగా నుండినచో మీ శరణేల చొచ్చియుందుము? ఆపత్కాలముననేకదా దేవతలు జ్ఞప్తికి వచ్చెదరు. 'మహోబా' పైన నేఁడు, ఈశ్వరున కాగ్రహము వచ్చినది. పృథ్వీరాయఁ డిప్పుడానగరమును ముట్టడించియున్నాఁడు. నరసింహుఁడును, వీరసింహుఁడును, శత్రుకరవాలముల కర్పితులై యున్నారు. సరసాపురము బూడిదకుప్ప యైనది. చందేలులరాజ్యము నాశనము కానున్నది! దేశమం దెల్లెడల దుఃఖారావములు ప్రబలినవి. ఎంతో కష్టముమీఁద నొకమాసము గడువు దొరకినది. పరిమళదేవుఁడు నన్ను మీకడకుఁ బంపి

నాడు. ఈ యాపత్కాలమున మాకు దిక్కెవ్వరును లేరు. మాకు ధైర్యమిచ్చువా రెవ్వరును గానరారు. మీరు మహోబా వదలిననాఁటినుండి యొకసారి యైనను బరిమళదేవుని పెదవులపైనఁ జిఱునగవు కానరాలేదు. ఎన్నియోదినములనుండి యాతనికన్నులు నిద్దుర నెఱుఁగవు. మిమ్ముఁ దనప్రక్కలోను తొడలలోను బెంచిన మల్హణదేవి రాత్రిందివములు మీకొఱకుఁ గన్నీరు గార్చుచున్నది! క్షత్రియవంశ సత్పుత్రులారా! చందేలులనావ మునుఁగుచున్నది; చందేలుల పేరు నిముసములో మాసిపోవనున్నది! ఇదే సమయము! ఖడ్గములఁ బూనుఁడు! మునుఁగుచున్న యీ నావను వెంటనే పైకెత్తిరేని చిరకాలము వగవవలసి వచ్చును. ఈ నావతోఁగూడ మీపేరేకాదు శూరశిఖామణి యగు మీ తండ్రిపేరు కూడ నడుగంటనున్నది!”

అలహుఁడు ముఖము చిట్లించి బదులు చెప్పెను. “ఏమైనను కానిమ్ము మాకావిషయమున జాలిలేదు. మాతండ్రిపేరు నేఁడు మునుఁగుటేల? ఏనాఁడు మమ్ము నిష్కారణముగ మహోబానుండి వెడలఁగొట్టిరో యానాఁడే మునిఁగెను. మహోబా మంటఁగలియనిమ్ము;

చందేలుల దీపము కొండ నెక్కసిమ్మా. మా కేమాత్ర
మును చింత లేదు. మహోబాకొలకు మే మొడిసిన
చెమటకు మమ్మ వెడలఁగొట్టుటయా నా ప్రతిఫలము?
మా తండ్రి మహోబాకొలకుఁ దన ప్రాణముల నర్పిం
చెను. మేము గోండులను జెండాడితిమి; చందేలులకు
దేవగడ మిప్పించితిమి; యాదవవంశముతోఁ బోరాడి
తిమి; కట్యారుబయళ్లలో, చందేలుల పతాకమును నాటి
తిమి; ఈచేతులతోనే కదా నేను ఛ్వాహులసేనా
ప్రవాహము నడ్డగించితిని; గయలో యుద్ధమును మేమే
గెలిచితిమి; రేవాను గర్వమును మేమే భంజించితిమి;
మేవాతులనుండి పన్నులఁగొంటిమి; ఈపనులన్నిటికి
మాకు వచ్చిన బహుమాన మిది యే? మా తండ్రి పది
మంది రాజులను మహోబాదర్బారునకు మాండలికులఁ
జేసెను. పరిమళ దేవుని కొలువున నే నేడుమారు
లపాయకరములగు గాయముల నొందితిని. మూఁడు
మారులు మృత్యుముఖమునుండి వెడలితిని. ఓట
మనునది లేక నలువది యుద్ధములఁ జేసితిని. ఓదలుఁ
డేడురణాంగణములలో జయముఁగాంచెను. చందేలుల
ప్రతాపమును మేము దిగంతములఁ జాటితిమి. చందేలుల
కీర్తిని మే మాకాశమున కంటించితిమి. ఇట్టి సేవకు

ప్రతిఫలము మాకులభించినది. మహీలుని సంతోష పెట్టుటకే కదా పరిమళ దేవుఁడు మమ్ము దేశాంతరమున కంపెను; ఆమహీలునే యిప్పుడేల పిలుపించుకొనఁడు ?"

జగన్నాథుఁడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "అలహా! క్షత్రియులనవలసిన మాటలాయివి? ఏరాజ్యముకొఱకు మీతండ్రి ప్రాణముల నర్పించెనో, ఆరాజ్యమే యిప్పుడు శత్రుపాదముల క్రిందనడఁగి పోవుచున్నది. అంతటివాని పుత్రుఁడవగు నీకు రోషములేదా? తన రాజును నాపదలలో వదలి తటస్థుఁడుగానుండు క్షత్రియునకు నరకాగ్నికన్న వేఱాశ్రయముకలదా? నీమాతృ దేశము పైన దుర్దశామేఘము లావరించి యున్నవి. మీతల్లులు మీయక్క చెల్లెండ్రు, శత్రువులచేత నవమానము పాలగుచున్నారు! ఇఁకనైన మీకు జాలికలుగదా? మాతృదేశ మిట్టి దుర్గతియందుండ, కనోజులో మీకెట్లు సుఖనిద్రపట్టును?"

జగన్నాథుఁడువచ్చిన వార్తదేవలదేవికిఁ దెలిసినందున నామె తత్క్షణమే కుమారులను బిలచి యనెను. "నాయనలారా! గడచిన దానిని మఱచిపొండు. నేఁడే మహోబాకు ప్రయాణముకండు."

అలహుఁడేమియు మాట్లాడలేదు. కాని ఓదలుఁడు కోపముతో ననెను. "మహోబాకుఁబోవుట మాకిష్టము లేదు. మనలనువారు కుక్కలవలె 'మహోబా'నుండి పాఱఁదోలిన దినమును మఱువఁజాలము. 'మహోబా' మునిఁగినను సరే తేలినను సరే. దానిని జూచు కోరికయు మాకు లేదు. కనోజే మాకు మాతృభూమి!"

దేవలదేవి కీవాక్యములు ములుకులవలెఁదోఁచెను. రౌద్రమూర్తియై యనెను, "ఓదలా! ఇట్టిమాటలు పలుకుటకు నీకు సిగ్గులేదా? ఇట్టిపుత్రులఁగనుటకన్న గొడ్రాలనైన బాగుండెడిది. కులమునకుఁ గలంకము నాపాదించు పుత్రులను గనుటకా నేను గర్భవేదనను సహించినది? దురాత్ములారా! నాయెదుట నిలువవలదు. మీముఖముఁ జూడఁగూడదు. మీవంటి మూర్ఖులు యశరాజునకుఁ దగిన పుత్రులుగానేరరు!"

ఈమాటలు వారి హృదయమున బాకుపోటులై నాటెను. వారినుదుటఁ జిఱుచెమట గ్రమ్మెను. లేచి నిలచియునిరి "అమ్మా! శాంతింపుము. ఇఁక మమ్ము నీశూలములచే నొప్పింపకుము. నేఁడే 'మహోబా'కుఁ బోయెదము. పరిమళదేవుని కార్యమున మారక్తము

నోడిసెదము. రణరంగమున మాఖడ్గముల కాంతిత మాతండ్రి కీర్తిని బ్రకాశింపఁ జేసెదము! చౌహాణుల తోడిపోరున శౌర్యమును బ్రదర్శించి దేవలదేవిసుతుల యశమును నజరామరముగఁ జేసెదము!"

సప్తమ రంగము

సోదరు లిరువురును తల్లితోఁగూడ కనోజువదలిరి. వీరు 'మహోబా'కుఁబోవఁగానే వాడిన చేలమీఁద వర్షము గురిసినట్లయ్యెను. భిన్నభిన్నములైన హృదయశకలము లతికికొనెను. శూరాగ్రేసరులకు స్వాగతమిచ్చుటకై యొక లక్షచందేలు నిలువఁబడిరి. దేశాంతరగతులైన సోదరు లెంతో కాలమునకు దేశసోదరులఁ గలసికొనిరి. ఆనందబాష్పములు కన్నులఁ గ్రమ్మెను. వీరిరాక విని పరిమళదేవుఁడు కీర్తిసాగరమను సరోవరమువఱకు నెదుర్కొనుటకై కాలినడకనఁ బోయెను. వీరసోదరులు పఱువునఁబోయి పరిమళదేవుని పాదములమీఁద వ్రాలిరి. మువ్వురికన్నులనుండి స్రవించిన కన్నీటి ప్రవాహ మంతకుఁ బూర్వము వారి హృదయములందుండిన మాలిన్యమును గడిగివేసెను.

శత్రుసేనలు సిద్ధముగా వచ్చియే యుండుటవలన నాతిథ్యసత్కారముల కవకాశము లభింపలేదు. కీర్తి సాగర తీరముననే చందేలు మహాపురుషులయొక్కయు మంత్రిగణముయొక్కయు నాలోచన ననుసరించి, ఆలహుఁడు సేనాధిపతిగా నభిషిక్తుఁడయ్యెను. అచ్చటనే; దేశారాధనమున నవసరమైనచోఁ జచ్చుటకును జంపుటకును శపథములు జరిగెను! అచ్చటనే, చందేలు వీరులు రణరంగమునుండి ప్రాణములతోఁ గదలమని ప్రతిజ్ఞచేసిరి! అచ్చటనే జనులొకరి నొకరాలింగనము చేసికొని, యదృష్టములను భవిష్యత్తున కప్పగించి సాగి నడిచిరి! ఆనాఁ డొకరి ముఖముననైనను దుఃఖచిహ్నములు లేవు. ఒకరి చూపులందైనను విన్నఁదనము లేదు. స్త్రీలు వికసిత ముఖకమలములతోఁ దమ ప్రియులను వీడుకొల్పుచుండిరి. పురుషు లానందముతోఁ బ్రియురాండ్ర నెడఁబాయుచుండిరి. ఇదియే తుదిపందెము. దీనిని గెలచుటయే బ్రతుకు; దీనినోడుటయే చావు!

ఇప్పుడు 'ఓరాయి' యను గ్రామమున్నచోట నుభయసైన్యములు డీకొనెను. పదునెనిమిది దినముల వఱకుఁ బోరు ఘోరముగ జరుగుచుండెను. పృథ్వీరాయుడు స్వయముగా సేనలనడపుచుండెను. ఇరువాగుల వారు

ధైర్యముతోఁ బోరి యచ్చటనే మరణించిరి. మూఁడు లక్షల సేనలో ముగ్గురు మాత్రము మిగిలిరి. మొదటి వాఁడు పృథ్వీరాజు; రెండవవాఁడు చాందుభాటు; మూఁడవవాఁ డలహాఁడు. చందేలులోఁడిరి. వారి పేరు దేశచరిత్రలో మాసిపోయెను. స్థానేశ్వరమున ముందు జరుగఁబోవు యుద్ధముయొక్క ఫలితముకూడ నిచ్చటనే ప్రకటితమయ్యెను. ఏలయన, చౌహాణులయొద్ద నుండిన శూరసైనికు లందఱు నీయుద్ధముననే మడియుటవలన, మహాబుద్దీనుతోఁ జేసిన సమరమునందు ననుభవశూన్యులగు క్రొత్తసిపాయీలు రణాంగణమునకు రావలసివచ్చెను. పర్యవసానమెట్లుండుట సహజమో యట్లే యుండెను. అలహాఁనిజాడ తరువాత నెచ్చటను గానరాలేదు., సిగ్గుచేత నాత్మహత్య చేసికొనెనో యోగులలోఁగలసెనో తెలియదు. అతఁడింకను బ్రతికియున్నాఁడని జనసామాన్యముయొక్క విశ్వాసము. అది నిజమే. అతఁడెప్పటికిని బ్రతికియేయుండును!

PRINTED AT THE ANDHRAPATRIKA PRESS :—MADRAS.

భక్తియోగము

(ద్వితీయముద్రణము)

బాబు అశ్వనీకుమారదత్తు ఎం.ఏ.,బి.ఎల్. గారి బంగాళిగ్రంథమున కాంధ్రీకరణము. ఉత్కృష్ట గ్రంథమని పండితులెల్లరు బాగడియున్నారు. ౩౬౦ పుటలు.

కాలికో వెల రు. ౧-౦-౦ రాపరు ౦-౧౨-౦

తుకారాముచరిత్ర

(ద్వితీయముద్రణము)

మహారాష్ట్రజాతీయోద్ధారకుడును, మహాభక్తుడగు తుకారామునిచరిత్ర నెల్లరు బఠింపదగినది. ఇందు తుకారాముని చిత్రపటము గలదు. భక్తిరసపూరితము ౧౮౦ పుటలు. వెల రు. ౦-౬-౦

జ్ఞానామృతము

ఇది యజ్ఞానమునుండి మేలుకొలిపి శాశ్వతపదవికి మార్గములను, నీతి భక్తి జ్ఞాన వైరాగ్యములను బోధించువాక్యముల కునికిపట్టు. సద్గుణాభ్యాసములకు సులభోపాయము లిందనేకములు గలవు. మంచిపద్యములు శ్లోకములిందు జేర్పబడినవి. వెల రు. ౦-౦-౬

చిరునామా:—సరస్వతీనికేతనము

బందరు.